

# అతడు

అల్లం రాజయ్య

డిసెంబరు నెల రెండో వారం. ఉదయం తొమ్మిది గంటలు దాటింది. 'కాలరీ' బొగ్గుపొగతో పాటు, చలికాలపు మంచుతెరలు పలుచబడుతున్నాయి. ఎండ పొడ వేడెక్కుతోంది.

రాత్రి డ్యూటీకి పోయి ఇంకా తిరిగిరాని భర్త కోసం మల్లిక ఎదురుచూస్తోంది. రాత్రి డ్యూటీకి పోయిన కార్మికులు సాధారణంగా ఉదయం ఎనిమిది గంటల కల్లా ఇల్లు చేరుతారు. ఆలస్యమైతే ఆడవాళ్లు ఎదురు చూస్తారు.

ఒకవేపు కూతురును బడికి పంపడానికి తయారు చేస్తూనే మల్లిక భర్త కోసం ఎదురుచూస్తున్నది. కూతుర్ని సాగనంపి క్వార్టరు ముందుకు వచ్చి నిలుచున్నది.

పక్కింటి సుమతి కూడా తన కొడుకును బడికి పంపి మల్లిక దగ్గరికి వచ్చి, "అక్కా రాత్రి బజిలీ (షిఫ్ట్)లో గొల్ల కొమురయ్య కప్పుకూలి చనిపోయిండట," అంది విచారంగా.

"అయ్యో! అందుకోసమేనా ఈ పూట ఈనెకు ఆలిస్యమయ్యింది," మల్లిక తల్లడిల్లుతూ.

"మీ మరిది చెప్పి పంపిండు. బాయి (గని) బందు పెట్టినారట."

"ఉత్పత్తి ఉత్పత్తంటు కంపినోడు పాడిపాడి పానాలు తియ్యవట్టిరి. వానికి బొగ్గు తప్ప మనుషుల పానాలు లెక్కలేదు," ఆ తరువాత ఏమనాలో మల్లికకు తోచలేదు. 'ఉత్పత్తి' ఈ మాట తను కొత్తగా నేర్చుకొన్నది. తన భాష కూడా మారి పోతున్నది. సుమతి గుర్తు పట్టిందా? సుమతి ముఖంలోకి చూసింది.

సుమతి ఆ విషయం పట్టించుకున్నట్టు లేదు. తన ధోరణిలో, "కొమురయ్య శవాన్ని తీసుకొని జనరల్ మేనేజర్ ఆఫీసుకు ఊరేగింపుగా పోయినారట- అంత లొల్లిలొల్లి చేసినారట," సుమతి.

చనిపోయిన కొమురయ్యను మల్లిక గుర్తుకు తెచ్చుకున్నది. తన భర్త షిఫ్టే. అప్పుడప్పుడు తమ ఇంటికి వచ్చేవాడు. ఇంకా ఎవరికైనా దెబ్బలు తగిలినాయా? మల్లిక మనసు కొమురయ్య గురించి తల్లడిల్లిపోయింది. కొమురయ్య కుటుంబం, పిల్లలు ఏమైపోతారో? ఈ ప్రమాదాలు ఈ చావులు ఆపలేరా?

"వాడు కనిపించకుండా ఉచ్చులు బిగిస్తున్నాడు," ప్రమాదాల మీద వేసిన కరపత్రంలోని మాటలు మల్లికకు గుర్తొచ్చాయి.

"ఇంకా నయం అక్క- దెబ్బలెవలకు తాకలేదట," సుమతి గొనుగుతూ వెళ్లిపోయింది. మల్లిక వికలమైన మనసుతో లోపలికి నడిచింది.

ఏ పని చేయడానికి మనసు పోలేదు. ఊరికనే ఇంట్లో తిరుగసాగింది.

మరో గంట తరువాత మల్లిక భర్త భూమయ్య పీక్కపోయిన ముఖంతో తల వంచుకొని ఇంట్లోకి వచ్చాడు.

గుబగుబలాడే గుండెతో మల్లిక, "ఎంత పని జరిగింది? ఎట్ల జరిగింది?" అన్నది.

భూమయ్య ఒకే ఒక్క నిమిషం మల్లిక ముఖంలోకి చూశాడు. "పాపం కొమురయ్య కుటుంబం," మల్లిక.

భూమయ్య ఆ మాట విన్పించుకోలేదు. వంచిన తల ఎత్తలేదు. బట్టలన్నా మార్చుకోకుండా మంచంలో పడిపోయాడు. అంతకన్నా మిక్కుటమైన బాధ అతని ముఖంలో. మల్లిక మనసు చివుక్కుమనిపించింది. తనకు చెప్పితే ఏమౌతుంది? తను పరాయిదా?

''జీయం ఆఫీసుకు పోయినారట, ఏమయ్యింది?'' మల్లిక బెడ్‌రూంలోకి వచ్చి అడిగింది.

భూమయ్య అయినా ఉలుకలేదు. ముఖం చూసి తెలుసుకుందామంటే గోడ వేపు పెట్టుకున్నాడు.

లొల్లి జరిగిందా? అరెస్టులు జరిగాయా? ఏమి జరిగి ఉంటుంది? మల్లిక ఊహకు అందలేదు.

జనరల్ మేనేజర్ మీదనో భర్త మీదనో కాని మల్లికకు కోపం బుసబుస పొంగింది.

ముందు రూంలోకి వచ్చి నిలుచున్నది. కొము రయ్య శవాన్ని, ఊరేగింపును ఊహించుకోవడానికి ప్రయత్నం చేసింది. తనవల్ల కాలేదు.

ఎందుకో ఈమధ్యన తనకు భర్తకు కనపడని దూరాలేవో పెరుగుతున్నాయి. ఇదివరకైతే తనకు అర్థం కాకున్నా అన్నీ చెప్పేవాడు. తనకు ఆసక్తి పెరిగి అర్థమౌతున్నకొద్దీ, 'ఇప్పుడు తనే మనసు పట్టక అన్నీ చెప్పుతుంది,' మిలమిల కళ్లల్లోకి చూస్తాడు. ఆ చూపుల అంతరార్థం తనకు తెలుస్తూనే ఉంటుంది. ఒకప్పుడు నోట్లో నాలుక లేనట్టుండే తను- మూగమొద్దులాంటి తను... మల్లికకు నిస్సత్తువ ఆవహించగా ముందు రూంలో కూర్చున్నది.

కూతురు బడికి పోతూ విడిచేసిన బట్టలు- చిందరవందర చేసిన పుస్తకాలు సదిరింది.

భర్త అన్నీ వివరించి చెప్పుతాడని, కనీసం లేచి బయటకు వస్తాడని ఎదురుచూసింది. తను ముందు గదిలో చేసే శబ్దాల అంతరార్థం గ్రహిస్తాడనుకున్నది.

భూమయ్య ఏ శబ్దాలను పట్టించుకోలేదు.

తనిప్పుడు మాట్లాడగలుగుతున్నందుకు- అలుకుపిడచలాగా మసిగుడ్డలాగా పడుండే తను... ఇప్పుడు లేచి నిలబడినందుకే గదా! ఎందుకో మల్లికకు గుండె గొంతులో కొట్లాడింది. తను లోలోపల కుమిలి పోతూ ఒంటరిగా దిగులుగా బతికిన గతపు నీలి నీడలేవో పరుచుకున్నట్లుగా తోచింది.

''ఇక్కడి నుండి వెనక్కి పోరాదు. ఉన్న కాడ ఉండరాదు. ముందుకే జరగాలి. జరిగి తీరాలి,'' 'అతను' అన్న మాటలు గుర్తొచ్చాయి.

అతను రెండు రోజుల క్రితం చెప్పిన పనులు గుర్తొచ్చాయి. ఈ గొడవ లేకుంటే- తను బజారుకు వెళ్లి 'ఆ పని' చూసుకొని కూరగాయలు కొనుక్కొని పద కొండు గంటలకు ఇల్లు చేరుకుందామనుకున్నది.

'ఇదంతా ఉండేదే? గొడువెందుకు?' మల్లిక కొంత తేలికపడి ఒక నిమిషం తనను తాను సిద్ధపరచుకొని బెడ్‌రూంలోకి వచ్చి భర్త ముఖం చూసి అవాక్కై పోయింది.

భూమయ్య కళ్లు ఎర్రగా ఉబ్బి ఉన్నాయి. ముఖంలో తనెప్పుడు చూడని చిత్రమైన వొణుకు.

''ఏమయ్యింది నీకు...'' మంచం చివర కూర్చుంటూ మనుషులకు మాత్రమే సాధ్యమయ్యే ప్రేమతో అతని ఒంటి మీద చెయ్యేసింది.

షాక్ కొట్టినట్టుగా మల్లిక చెయ్యి తీసేసి, ''ఫో! నీ పనులు చూసుకో ఫో,'' భూమయ్య.

కంఠం కొత్తది. అది బాధా! దుఃఖమా! ఇట్లా అయి తీరుతుందని తను ముందే అనుకున్నట్లు- దాన్ని ఖాతరు చెయ్యనట్లు- అది ఎవరి మీద కోపం?

''ఇందాక సుమతి చెప్పింది. కొమురయ్య...'' మల్లిక గురగురలాడే గొంతుతో.

భూమయ్య ఒకే ఒక్క నిమిషం మల్లిక ముఖంలోకి చూశాడు. ఏమనుకున్నాడో ఏమో? అటు తిరిగి కాసేపాగి, ''మా డిస్ట్రిక్టు (పనిచేసే స్థలం)లోనే 'గోపు' (బొగ్గును పూర్తిగా తీయగా ఏర్పడే ఖాళీప్రదేశం) వచ్చింది.''

ఇంకేమైనా చెప్పగలడని చూసింది. మల్లికకు మాటలు కరువయ్యాయి.

బయటకు పోవాలా వద్దా అని కాసేపు గుంజాటన పడ్డది. భర్తను కాసేపు ఒంటరిగా వొదిలిపెడితేనే బావుంటుందేమో? అనునయపు మాటలు తనకు చేతకావడం లేదు. అలాంటి మాటల వలన మరింత దుఃఖం కలుగుతుంది.

బయటకు పోకపోతే- ఇవ్వాళ సాయంత్రం అతను కలుస్తానన్నాడు. ఆ ఉత్తరం ముఖ్యమైందేమో? పనాగి పోతుంది.

ఎప్పుడూ ఇంతే- ఏ పనిచేసినా ఇన్ని ఆలోచనలు- కాళ్లు మలుకలు పడేటట్టు- ఏదీ తేల్చుకోలేదు. తన పుటుకే అంత. ఏదైతే అదైతుందని ఏదీ చేయజాలదు. ఎప్పుడూ వెనక్కు ముందుకు యాతం పోయడమే.

''నేను కూరగాయలు తేవాలె- నీల్లు చల్లారి పోయినయనుకుంట తోడనా? చాయ్ పెట్టియ్యనా?'' వంటింటిలోకి నడుస్తూ మల్లిక.

''వద్దు...'' భూమయ్య.

పోవద్దంటాడా? చాయ్ వద్దంటున్నాడా?

''నువ్వు పో,'' భూమయ్య. కొమురయ్య చావు కన్నా తీవ్రమైన దుఃఖమేదో చుట్టుకున్నట్టు.

పోనీలే- కాసేపు పడుకోనియ్యి. అయ్యో, చాయ అయినా తాగితే కాసంత తెరిపిన పడునూ- ఎట్లా తాగు తాడు? ఇట్లా ఆలోచిస్తూనే తలుపు దగ్గరేసి వీధిలోకి వచ్చింది మల్లిక.

వీధంతా నిర్మానుష్యంగా ఉన్నది. సైకిళ్లు, స్కూటర్లు నడుస్తున్నాయి. ఎందుకో అవి తొట్రు పడుతూ వేగంగా పోతున్నట్టున్నాయి.

మల్లిక మెయిన్‌రోడ్డు మీదికచ్చింది. టేలాలు (చిన్న దుకాణాలు) అన్నీ మూసేసి ఉన్నాయి. మొగ వాళ్లు అక్కడక్కడ ఒకరిద్దరు చేరి ఏదో గుసగుస లాడుతున్నారు. ఊరికనే కాబోలు. తనకు అన్నీ అనుమానాలే. ఈరోజు 'బందు' గిన పెట్టినారా? బందు పెడితే ముందే అనుకుంటారు గదా! తనకు తెలుస్తుంది గదా! పెద్ద తనకే అన్నీ తెలిసినట్లు.

మల్లిక వంద గజాలు నడిచిన తరువాత అటిటు చూసి గోడల మీద ఏమైనా పోస్టర్లు కొత్తగా అతికించా రేమోనని కళ్లతో వెతికింది. ఎప్పుడో అంటించిన రంగు వెలిసిన చిరిగిన పోస్టర్లేగాని కొత్తవేమి లేవు. రెండు రోజుల క్రితమే 'అతను' కల్సినాడు గదా! ఏమో ఎంతలో మారుతుంది.

ఆటో ఎక్కితే రూపాయి. పని ముగించుకొని తొందరగా రావొచ్చు. మూలమీద నిలబడి చూసింది. ఒక్క ఆటోనన్నా తిరగడం లేదు. ఏమయ్యిందబ్బా! కాళ్లల్లో కలెబెనిగినట్టు బుర్రబుర్రన తిరిగే ఆటోలకే మయ్యింది?

సైకిల్ గంటలు గణగణ మోగించుకుంటూ- స్కూటర్ల హారన్లు కీచుకీచుమంటుండగా చాలా మంది ఉత్తరం వేపు పోతున్నారు.

మల్లిక ఉత్తరం వేపు చూసింది. వేనవేల ఇండ్ల పైకప్పుల మీదుగా నీలం కొండ. ఏమైంది వీళ్లకు, చేపలు వర్షాకాలంలో ఎదురెక్కినట్టు- అందరు అటే పోతున్నారేంది? ఇంత తండ్లాటెందుకు నోట్లో నాలు కుంచుకొని- ఎవరినైనా అడుగుతె కాదా?

గబగబ కొంతదూరం నడిచి ధోవతి కట్టుకొని సైకి లెక్కి పోతున్న నడీడు మనిషిని ''అన్నా అందరెందుకో గావర మీదున్నరేందే?'' మల్లిక.

ధోవతాయన సైకిలు పక్కకు మలిపి, ''గావరా! గంగరాయా! అంత అగులు బుగులుగుంటె,'' మల్లిక అడిగిన మాటకు జవాబు చెప్పాలనే మాటే మరిచి సైకిలు స్పీడు పెంచి వెళ్లిపోయాడు.

ఎవరు ఎవరికి ఏదీ చెప్పరు! ఇక్కడంతా ఎవరికివారు తెలుసుకోవాల్సిందే! చెప్పినా సీదా చెప్పరు. తను మాత్రం సీదా చెప్తుతుందా? అడిగిన వాళ్లెవరో తెలియకుండా? ఎట్లా అలవాటయ్యిందీ మాటతీరు. ఇంతకూ ఏమయ్యింది? బాయిలు (గనులు) బందా? రాత్రి బజిలీ (షిఫ్టు) నడిచిందే? కొమురయ్య కోసం ఇంత జరుగుతుందా? రోజూ ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి? ఎవరికన్నా ఏమన్నా అయ్యిందా? ఎవ రన్నా పెద్దోడు వస్తున్నాడా? ఎవరినైనా పట్టుకున్నారా?

'అయిదేండ్లు' సైగలు తప్ప మాటలు బందు చేసినపుడు ఎక్కడేమి జరిగిందో తెలియకుండేది. ఎవరిని చంపారో ఎవరిని ఎత్తుకపొయ్యారో తెలిసేది కాదు. చెన్నారెడ్డి రాగానే మల్ల పట్టపగ్గాలు లేకుంట య్యింది. కట్ట తెగిన చెరువోలె- మీటింగులు, పాటలు, ఎగరడాలు- దునకడాలు, కిడ్నాపులు- ఇసుకవేస్తే రాలకుండా ఏడచూస్తే ఆడ- ఇంతమందికి ఇన్ని విషయాలు తెలుసునంటే నమ్మశక్యం కానంత.

మళ్లీ ఎక్కడికక్కడ బిగుసుకుంటున్నాయి. మళ్లీ పాత రోజులే వస్తాయా? వస్తే... మల్లిక ఇలాంటి ఆలోచనలతో కూరగాయల మార్కెట్టుకు చేరుకున్నది.

కూరగాయల మార్కెటంతా గజిబిజిగా గందర గోళంగా ఉన్నది. సగం దుకాణాలు సర్దేసి మూసి వున్నాయి. దుకాణదారులు చాలామంది హడావుడిగా తడుకలు అడ్డు పెడుతూ మిగతా సగం మూసే ప్రయత్నాల్లో ఉన్నారు.

మార్కెటుకు ఆనుకొనే తూర్పు వేపున ఉన్న పెద్ద బజారులో పోలీసు జీబులు అయిదారు ఒకటి వెనుక మరొకటి బర్రుబర్రున పరుగెత్తాయి.

ఏదో జరిగింది.

మల్లిక గుండె దడదడలాడింది. తను ఎప్పుడూ కూరగాయలు కొనే ముసలవ్వ దగ్గరికి పోయి నిలు చున్నది. ఆవలిపక్క తనకు చిట్టీ యివ్వవల్సిన దుకాణం మూసే ఉన్నది. అంటే...

కూరగాయలు అమ్మే ముసలవ్వది భారీ కాయం. షాపు విడిచిపెట్టి పోయినందుకు మనుషుల మీద గొనుగుతూ తను షాపు మూయడం ఎలాగా అని అటీటు చూస్తున్నది.

''పెద్దవ్వా! ఏమయ్యిందే?'' మల్లిక.

''ఎంత పిస్సదత్తరం దానివే మల్లక్కా,'' ముసలవ్వ.

షాపుల ముందు గుమిగూడిన వాళ్లు గుసగుసలాడుతున్నారు. కొందరు దిగ్భ్రమకు లోనై ఖిన్నులైనట్టు చేష్టలుడిగి నిలుచున్నారు. మరికొందరు పగిలిపోయినట్లు వదురుతున్నారు. చప్పిడి దవడల వాళ్లు, పీక్కపోయిన ముఖాల వాళ్లు తత్తరపాటుతో ఆడికీడికి ఊరకనే తిరుగుతున్నారు. దుకాణాలు సర్దేవాళ్లు- కూరగాయల కోసం వచ్చినవాళ్లు- ఆడ, మగ, పిల్లాపీచు, ముసలివాళ్లు అందరు అదేదో సుడిగాలికి ఎగిరే ఆకుల్లా- చిందరవందరగా తత్తరపాటుగా ఉన్నారు.

పొగలాగా దుమ్ము రేగుతోంది. తుఫాను హోరులాగా అసంబద్ధ మాటలు శబ్దాలు కలెగల్సిపోయిన రొదలో.

''బిడ్డా!'' ముసలవ్వ ముద్దయిపోయిన గొంతు సవరించుకున్నది ముక్కు చీదింది.

''మనిషెట్లుంటడో పరమాత్ముని కెరుక. నా కొడుకు, దుఃఖపడే మనుషుల కడుపుల పేగయ్యిండు. తల్లడిల్లే మనుషుల తలరాతలు మారి తీరుతయన్నడు,'' ముసలవ్వ నోరు మూతపడిపోయింది.

ఏదో కదులుతోంది. కాళ్ల కింది నేల చెరచెర చెక్కలౌతున్నట్టుగా- తనందులో కూరుకుపోతున్నట్టుగా మల్లిక ముసలవ్వను ఆసరాగా పట్టుకున్నది. ముసలవ్వ తనకే ఆసర దొరికినట్లుగా మల్లికను పట్టుకున్నది.

భర్త బొగ్గు గనిలో రెండు కాళ్లు తెగిపోయి, సంపాదించే ఆధారం పోతే చిన్నపిల్లలను, భర్తను సాకడానికి 'కొనడం అమ్మడం' తెలియని తను- ఇన్నేండ్లు కూరగాయల వ్యాపారంలో గడ్డకట్టినదేదో పగిలినట్లు- లోలోపలి మనిషి కదిలినట్లు ముసలవ్వ మాటలు రాక ఏడ్చింది. ఆ ఏడుపును ఎవరూ పట్టించుకున్నట్లు లేదు.

''చంపేసిండ్లు బిడ్డా! చంపేసిండ్లు,'' ముసలమ్మ అందరికి పరిచయమైన 'అతని' పేరును గొణిగింది. ఆ తరువాత గొంతు పూడుకపోయి కూలబడిపోయింది.

మల్లిక ముసలమ్మ పీల గొంతుకే సలి పిడుగు మీద పడినట్లుగా వనికిపోయింది. ముఖం రక్తం తోడేసినట్లుగా పాలిపోయింది. సమస్త చేతనలు లుప్తమైనట్లు- మాట తోడేసినట్టు కళ్లు బైర్లు కమ్ముతుండగా నిలబడిపోయింది.

ఒక మనిషి ప్రేరేపించిన మనిషి సమస్త అంతర్ శక్తులు కుప్పకూలినట్టుగా మల్లిక నిలబడిపోయింది. తలలో చిత్రమైన పోటు.

ముసలవ్వ తనకు ఆత్మీయమైన మనిషి మల్లిక కన్పడగానే తను అదే స్థితిలో పడిపోయింది.

మల్లికకు కన్నీళ్లు రాలేదు. కన్నీళ్లు తెరిపిన పడే స్థితి. కన్నీళ్లు గడ్డ కట్టిన మేఘాలు ఒకటి నొకటి ఢీకొని ఘర్జించి, ఘర్జించి నుగ్గునుగ్గయి కలెగల్సి వర్షించే స్థితి. మల్లిక మనసులో మేఘాలు చెలరేగే స్థితి. ఉరుములు, మెరుపులు.

అలాంటి స్థితిలో ఆ వీధిలో మల్లిక ఎంతసేపు నిలబడిందో తెలియదు. ఆమెనెవరు పట్టించుకునే స్థితిలోగాని, ఊరడించే స్థితిలోగాని లేరు. ఎవరికివారే- వారివారి నిత్యజీవితపు వేలాది వ్యవహార నటనలను మరిచిపోయి అచ్చమైన మనుషులై అది అలవాటు లేక తొట్రుపడుతూ తొక్కిసలాడుతున్నారు. రూపొందని గతిక్రమంలేని చిత్రమైన తడిగల భాషలో మాట్లాడుతున్నారు.

తేరుకున్న వాళ్లు కొందరు చంపేయబడిన అతని దగ్గరికి పరుగెత్తుతున్నారు.

వీధులు అలాంటి మనుషులతో అల్లల్లాడిపోతున్నాయి.

మల్లిక మూగమొద్దులాగా నిలుచున్నది. మొదట తనెక్కడ నిలుచున్నది తెలియలేదు. తెగిపోయి మొద్దుబారిన స్థితి రాగానే తేరుకొన్నదానిలాగా చుట్టు కలియజూసింది.

దాదాపు దుకాణాలన్నీ మూసేసి ఉన్నాయి. ముసలవ్వ దుకాణం ఆమె మనుషులు సర్దేశారు. ముసలవ్వ ఏదో గొనుగుతూ మల్లికను మరిచిపోయి వెళ్లిపోయింది.

ఇప్పుడు తనెక్కడికి పోవాలి?

మల్లిక ఇల్లు- సమస్తం మరిచిపోయిన దానిలాగా అయిపోయింది. ఎక్కడో ఏదో తచ్చాడుతోంది. చిన్నపిల్ల గుక్కపట్టి ఏడుస్తున్న ఏడుపులాగా చెవులు గింగిర్లెత్తిస్తూ ఏదో వినపడుతోంది.

గాలిలో తేలిపోతున్నట్లుగా, కాళ్లు తన స్వాధీనంలో లేనట్లుగా ఆ ఇరుకు మార్కెట్టు గల్లీలో నుండి నడిచి మల్లిక మెయిన్ రోడ్డు మీదికొచ్చింది.

వీధులన్నీ మల్లిక లాంటి మనుషులతో కిటకిటలాడుతున్నాయి. యుద్ధంలో బాంబుదాడి జరిగి ఆగిపోయిన తరువాత తత్తరపాటుతో ఎటు పోవాలో తెలియకుండా మనుషులు పరుగెత్తినట్లుగా అంతా ఉత్తరం వైపు పోతున్నారు.

మల్లికకు ఏదీ కన్పించడం లేదు. మరేది విన్పించడం లేదు.

పెద్దపెద్ద కళ్లు- ఎప్పుడూ సన్నగా గడ్డం పెరిగి ఉండే కోల చెంపలు- కోసు ముక్కు- వెంటాడే చూపులు.

మల్లిక గుండె దడదడలాడింది. ''పిల్లా నీ మొగడు చనిపోయిండే,'' ఎవరో చెప్పుతున్నారు. చేతుల గాజులు పగులగొట్టారా? ఆ ముఖం తను ద్వేషించిన ముఖం. తను పోరాడిన ముఖం- తను తప్పించు కోవడానికి చీకటి దారుల్లో పరుగెత్తించిన ముఖం.

ఆ ముఖం ఇప్పుడెందుకు గుర్తుకు రావాలి? ఆ చావు ఇన్నేండ్ల తర్వాత కూడా తనకెందుకు గుర్తుండాలి. తనకు పిచ్చి లేస్తున్నదా? పట్టు తప్పుతున్నదా? తను వీధిలో అటుయిటూ పరుగెత్తుతూ అరవది కదా!

బలవంతంగా దేన్నో పెకలించి పారేసినట్టుగా మల్లిక ఆదరబాదరగా పోయే మందిలో కలిసి గబగబ నడిచింది.

ఇది పోలీస్‌స్టేషన్. అసహ్యంగా ఉందా? హడా విడిగా, ఆందోళనగా ఉందా? మెడ రిక్కించి చూసింది. తనకే అట్లా కన్పిస్తున్నదా?

ఆ మురికి గోడలకు, ఆ నెత్తురు పులుముకున్న గోడలకు ఈ మనుషులంతా చూస్తుండగా ఎర్రెర్రగా ఏమన్నా రాయాలి. ఎక్కడో మళ్లీ కలుక్కుమన్నది.

ఎటు పోతున్నట్లు? తను నిర్జీవంగా పడున్న అతన్ని చూడగలదా? అది చూసి తను భరించగలదా? ఆ ముఖం, ఆ కళ్లు. 'అక్కా' అతని పిలుపు- అప్పు డప్పుడు ''అమ్మా,'' అని సంబోధించి ముచ్చట చెప్పిన ఆ నోరు. సమస్త కదలికలను గుర్తుపట్టగల ఆ కళ్లు... బహుశా ఆ కళ్లు తనతో మాట్లాడుతాయి. చివరి వీడ్కోలు...

మల్లిక మనసు చెప్పరాని ఆర్ద్రతతో... ఈ పిలుపు కన్నా- తను చెప్పిన విషయాల కన్నా తను స్వీకరిం చింది, ఔను స్వీకరించింది. తను లోలోపల ఎవరికి తెలియకుండా- కన్పించనియ్యకుండా దాచుకున్న... మనుషులకే భయపడి- భయం తన అలవాటై తనకు తననే దాచుకున్న తనను- చీకటిగుహలో దాక్కున్న దిక్కుమాలిన తనను గుర్తుపట్టి వెన్నుతట్టి- కాదు ఇవేవి కాదు కానేకాదు, తనకు తెలియదు.

తను తన నుండి బయటకు రావడానికి రహ స్యాంతర గుహల్లో నుండి బయటకు తొంగి చూడ డానికి- చీకటిని, చెడును మాత్రమే చూడడం అల వాటుపడిన తను గింజుకున్నది. ద్వేషించింది, కోపిం చింది, తిట్టింది. అయినా నవ్వుతూ ఇదంతా తెలిసిన వానిలాగే అలవాటున్న వానిలాగే గాయాలను లెక్క చేయకుండా-

ఏమి చేశాడు? అతనికీ విద్య ఎట్లా వచ్చింది? అదంతా తనకు తెలియదు- చెప్పరాదు.

మల్లిక తన చుట్టూ కలయజూసింది. పక్కనుండే పెద్ద పోలీస్‌వ్యాన్ పోతోంది. వ్యానులో చిప్ప టోపీల పోలీసులు. వీధిలో మంది వ్యాన్ హారన్ మొత్తుకున్నా ఖాతరు చెయ్యడం లేదు. ఆగింది. దాన్ని చూసి మంది అరుస్తున్నారు. వ్యానులో నుండి బూట్లు టకటక కింది కురికాయి. లాఠీలు గాలిలో తిరుగుతున్నాయి. కంఠాలు గాలిలో మోగుతున్నాయి. ఉరుకులు పరుగులు.

మల్లిక లోపల ఏదో తిరుగబడుతోంది. మల్లిక పక్కన జీరబోయిన గొంతుతో ఎవరో, ''అమర్ హై,'' అరిచారు. మల్లిక అటు చూసింది. చేతులన్నీ గాల్లోకి పిడికిళ్లతో లేచి ఉన్నాయి. తను చెయ్యెత్తి అరువా లనుకున్నది. చెయ్యి లేవలేదు. గొంతు పెకులలేదు.

''అతను మనిషి- లక్షలాది మందిని లోలోపల ముట్టుకున్న మనిషి- అతను నాకు తెలుసు. నాకు మాత్రమే తెలుసు. అతనికి ఈ చేతులతోనే వండి పెట్టాను. అతను చెప్పిన అతనివి కాని పనులను ఈ చేతులతోనే చేసిపెట్టాను. అతను ఎలాంటి మనిషంటే- అతన్ని చంపేసిన వాళ్లకు తెలిస్తేనా?'' తను ఉపన్య సిస్తున్నట్లు వేలాదిమంది తన చుట్టూ గుమిగూడినట్లు భ్రాంతి.

మల్లిక భ్రాంతి నుండి తేరుకునేసరికే పోలీసు వ్యాను వెళ్లిపోయింది. చూర్ల కింద- క్వార్టర్ల లోపలికి చెదిరిపోయి వీధిలో పలుచగా ఉన్నమంది, మళ్లీ వీధిలో గుమిగూడుతున్నారు. వాళ్ల కళ్లల్లో ఏదో చర్య రూపు కడుతోంది.

''తాగె బాంచె నా కొడుకులకు బతిమాలి చెప్పిండు. వద్దనంగా అమ్మేటోనికి తన్ని చెప్పిండు. తాగుడు బందయ్యింది. ఒక్క మొగడన్న భారియను కొట్టాలంటే ఉచ్చబడ్డది,'' ఒక మురికి బట్టల స్త్రీ తనకు తాను చెప్పుకున్నట్లో మందికి చెప్పుతున్నట్లుగానో చెప్పుకుంటూ పోతోంది.

ఇంకా పల్లెవాసనలు పోనివాళ్లు- కాలరీ వాతా వరణంలో ఇముడని అమాయకులు మనసులో వున్నది పైకే చెప్పేస్తున్నారు. ఆ మాటలవల్ల బంగారం వెలికితీత అనే రక్తసిక్త గాయాల చరిత్ర గత పన్నెండు సంవత్సరాల కార్మికుల పోరాట అనుభవంలో- ఆటు పోట్లు, సమ్మెలు, లాకౌట్లు, ధర్నాలు, డిస్‌మిస్‌లు, చిత్ర హింసలు, హత్యలు చూసిన కార్మికులు- ఆ జ్ఞాపకాల అంతరాంతరాలల్లో అతని ఉనికిని ఎవరికి వారే ఒక్క పెట్టున అనుభవిస్తున్నారు.

వాళ్లు మాటలు మరిచిపోయినట్లున్నారు. వాళ్ల కొడుకులు ఉద్యోగాలు లేక లౌకికం తెలియక

అనుసరించలేక- రాక- చదువుల పెను పరుగు పందేలల్లో తికమకపడిన యువకులు ఈ షాక్ నుండి తేరుకోలేకుండా ఉన్నారు.

బ్యూరాక్రాట్లు, ఉద్యోగులు, ఉద్యోగాలల్లో మెట్లమెట్ల హోదాల వాళ్లు- వ్యాపారస్తులు అందులో క్లాసులవారీ వారు, క్రూర కర్కశ వ్యాపార కుమ్ము లాటలో అటుయిటుగా కదిలినవారు- పెనుగులాడిన వారు- దివాళా తీసినవారు, దేదీప్యమానంగా వెలుగు తున్నవారు, అన్ని యూనియన్ల నాయకులు, కింది డెలిగేట్లు- పోలీసు అధికార్లు, పోలీసులు, ఆ కాలరీ ప్రాంతంలో నివసించే అన్ని వయసులవారు అన్ని రకాల వారు ఆ ఒకేఒక్క మనిషి- సమస్త బొగ్గు గనుల ప్రాంతాన్ని ఆ ప్రాంతంలోగల అన్ని శక్తులతో పోరాడి- లాలించి, బుజ్జగించి కుదుళ్లతో సహా కదిలించిన మనిషి ఆ కాలరీ గుండెకాయలో పారిన రక్త చలన సంగీతం అలాంటి మనిషి. అతను మనిషేనా? అయితే ఎలా ఉంటాడు? అతన్ని చూడడానికి పోతున్నారు.

వీధులు మనుషుల పదఘట్టనలో దుమ్ము రేగుతున్నాయి. గుంపులు గుంపులుగా జనం. గనులన్నీ బందు చేసి డ్యూటీల మీది నుండే కార్మికులు పరుగెత్తు కొచ్చారు. ఆఫీసులు బందు చేసి గుమాస్తాలు తదితర సిబ్బంది వచ్చారు. ఇళ్లకు తాళాలు వేసి ఆడవాళ్లు, స్కూల్లు బందు చేసి పిల్లలు వచ్చారు.

జనాన్ని కంట్రోల్ చెయ్యలేక పోలీసులు జీబుల్లో తిరుగుతూ మైకులో మొత్తుకుంటూ లాఠీఛార్జీ చేస్తూ తంటాలు పడుతున్నారు.

ఆ మందిలో మల్లిక నడుస్తోంది. పోటెత్తే అతని జ్ఞాపకాలల్లో తడుస్తోంది.

నల్లగా బొగ్గు దుమ్ము లేస్తోంది. 'మాగి' ఎండ చుట్టేసిన దుఃఖంలాగా వార్త కార్చిచ్చులా చుట్టూ వ్యాపిస్తోంది. దూరపువాళ్లు ఏ వాహనం దొరికితే ఆ వాహనం మీద వచ్చి చేరుకుంటున్నారు.

ఇది ఎటు దారి తీస్తుందో? ఎక్కడ ఏది బద్దలౌ తుందో? బొగ్గు గనులన్ని పేలిపోయి అంటుకొని మండగలవన్నంతగా అధికార్లు భయపడుతున్నారు.

పెద్ద బజారులో నుండి అనేక సందులు చీలు తున్నాయి. సందులు ఇరుకు సందులు- మురికి సందులు- అలాంటి మురికిసందుల్లోని మూడో మురికి సందులో- వొత్తుకొని, వొరుసుకొని ఇసక వేస్తే కింద రాలకుండా జనం- తలకాయలు- వాటికి మొలిచినట్టు చేతులు మాత్రమే పైకి కన్పిస్తున్నాయి.

ముందేమయ్యిందో పెద్ద బొబ్బ లేచింది. జనం తోసుకుంటూ తొక్కుకుంటూ వెనక్కి పరుగెత్తుకొస్తు న్నారు.

"వీళ్లింట్ల పీనుగులెల్ల- శవాన్ని కూడ చూడనిస్త లేరు."

"కొడుకు గరంకోటు మీదనే ఉన్నడు."

"ఆవలిపక్క మురికి తుమ్మలు. అక్కడ మాటు గాసి కాల్చేసిండ్లు. ఏ పాపిష్టి ముండాకొడుకు పున్యం కట్టుకున్నడో?"

"కాల్చిన పోలీసు టూటౌనుల పిచ్చిపిచ్చి చేత్తండట."

మాటలు. మాటల మధ్యలో నినాదాలు. హోరెత్తే నినాదాలు.

పటపట లాఠీ దెబ్బలు. తలల మీద లాఠీలాడు తున్నాయి.

మైకులో ఏవో హెచ్చరికలు.

ఏమి జరుగుతోందో మల్లికకు తెలియడం లేదు. అందరు వెనక్కి పరుగెత్తుకొస్తుంటే మల్లిక ముందుకు పోతున్నది.

ఒక పోలీసు మల్లికను లాఠీతో వెనక్కి తోశాడు. అక్కడి నుండి అనేకమంది పోలీసులు వలయంగా ఏర్పడి ఉన్నారు.

మల్లిక నీటి పంపుల కోసం తవ్విన కందకాలల్లో పడబోయి తమాయించుకొని ఎవరిదో క్వార్టర్ గోడ పట్టుకున్నది.

తను అతన్ని చూడలేదు. చూడనియ్యరు. ఇది కలా? భ్రాంతా? తను కలకంటున్నదా? తనకు ఎన్నో పీడకలలు వచ్చేవి- ఇది అలాంటిదేనా?

మల్లిక వెనక్కి తిరిగి నడుస్తోంది. మళ్లీ పెద్ద బజారులోకే వచ్చింది. మూల మీద ఏదో యూనియన్ ఆఫీసు ముందు వేపచెట్టు. వేపచెట్టు మొదట సిమెంటు గద్దె కట్టారు. అప్పటికే ఆ గద్దె మీద చాలామంది స్త్రీలు కూర్చుండి ఉన్నారు.

కొందరు కార్మికులు ముందుకుపోయి చంపేసిన తమ ప్రియతమ నాయకున్ని కడసారి చూసుకోవడానికి దారులు వెతుకుతున్నారు. పోలీసు వలయం తెగిపో తుందని బద్దలు కొట్టగలరని అప్పుడు తమ కన్నీటి వీడ్కోలు తెలుపుదామని ఎదురుచూస్తున్నారు.

స్త్రీలు తమ భర్తలు తాగొచ్చినపుడు, కొట్టినపుడు అతనికి చెప్పగలమని బెదిరించేవారు. భర్తలు కుక్కిన పేనుల్లా అయిపోయేవారు. లోలోపల అతని గురించి ఆలోచించేవారు. ఎక్కడ ఏ గాయం తగిలినా, ఎక్కడ

కన్నీటి కెరటం పొగిలినా అతనికి తెలుస్తుందనుకున్నారు.

'ఎట్లా సాధ్యం?' మల్లిక అందరి ముఖాల్లోకి చూస్తూ అనుకున్నది.

అతను ఇన్ని వేలమందిని కలిశాడా? ఇంత మందితో ఊసులాడాడా? వీళ్లందరు అతన్ని ఎరిగినట్లుగానే చెప్తున్నారే? మాట్లాడుతున్నారే? ఏమో? తమ ఇంటికి వచ్చినట్లుగానే వీళ్లందరితో కలిశాడేమో?

''దేవుడు! దేవునికి పూజలు కావాలిగాని...'' ఎవరో ముసలవ్వ అంటున్నది.

మల్లికకు ఇల్లు గుర్తుకురాలేదు. బిడ్డ గుర్తుకు రాలేదు. భర్త గుర్తుకురాలేదు. అందరిలాగే మల్లిక వేపచెట్టు గద్దె మీద కూర్చున్నది.

ఇంకా ఆ వీధుల్లో పరుగులు పెడుతున్న మందినిగాని- కార్లల్లో, జీబుల్లో వచ్చే పెద్ద పెద్ద సేట్లు- మేనేజర్లు ఆ ఇరుకు సందులోకి పోయి వస్తూనే వున్నారు. పోలీసులు వారికి దారి యిస్తూనే ఉన్నారు. ఆ తతంగం మల్లిక పట్టించుకోనేలేదు.

మల్లిక ఎక్కడో తచ్చాడుతోంది...

గోదావరి తీరంలో తూర్పు, దక్షిణం వ్యాపించిన కొండల మధ్య ఊరు. మల్లిక కరుగుతోంది. 'ఎందుకొచ్చినవే మల్లిక, ఈడ ఏముందని వచ్చినవే మల్లిక.' నీళ్ల మీదికంటా వంగిన విషముష్టి చెట్ల నీడల కింద వెక్కివెక్కి ఏడుస్తున్న మట్టిముద్దలాంటి, మూగముద్దులాంటి పిల్ల.

రెల్లుగడ్డి ఇల్లు, ఎడ్లబండి బోర్లపడి కాలు ఉండె తొలిగి మందులు మాకులు వాడినా గెంతుతూ నడిచే తండ్రి. తనకన్నా చిన్నవాళ్లయిన తమ్ములు. ఎప్పుడు ఎవరినో తిట్టే తల్లి...

మాదిగడప్పు చప్పుళ్లు. ఆదరబాదరగా బ్రాహ్మడు చదివిన పెళ్లిమంత్రాలు. అప్పటికే అంతెత్తుగా ఉండే మేనత్త కొడుకుతో పెళ్లి. తాగుబోతు, తిరుగుబోతు భర్త- భర్తంటే ఏమిటో తెలియని వయస్సు. తనను ఎవరూ అడుగలేదు. తను పారిపోయింది. గొరగొర ఈడ్చుక వచ్చారు. ''నాకు వ్యవసాయం చెయ్యరాదు. తమ్ములు చిన్నోళ్లు- పాలేరుకు తప్ప భాగ్యవంతునికిచ్చే తాహతు లేదు,'' తండ్రి ఏడుపో, కోపమో తెలియదు. అదే వూళ్లోని చివరి గుడిసెకు తను మారింది. అందరిలాగా నవ్వే తను- ఎగిరే తను- దునికే తను- గోదావరిలో ఈతలు కొట్టే తను- ఉక్కపోసే ముతక చీరెల్లోకి మారింది. అత్త తిట్లు- కొట్టేది.

రాత్రుళ్లు నిద్రపట్టక ఆ చీకటి రాత్రుళ్లు ఏడ్చేది. ఓదార్చేవారెవరు? భర్త చనిపోయేనాటికి కూడా భర్త ముఖం చూసెరగదు. పల్లె చేలల్లో కలుపులు, పొలాలల్లో నాట్లు.

వేపచెట్టు కింద ఆడవాళ్లు ఎందుకో గబగబ లేచారు. మల్లిక తేరుకొని చూసింది. అటునుండి వచ్చిన ఒక పోలీసు అధికారి ఏదో అన్నట్లున్నాడు. ఆడవాళ్లంతా ఆ అధికారి మీదికి పోయారు.

మల్లిక లేవలేదు. అంతా కలెగాపులగం. ఏదో తెగిపోతోంది- ఏదో మళ్లీ అతుక్కుంటోంది.

నులకమంచం. కొత్త శద్దరు. తను భర్తను కొరికి పరుగెత్తింది. వెన్నెల రాత్రి పరుగెత్తింది. వేటాడి వెంటాడి తెచ్చారు. ఆ తరువాత తను అత్తగారింటికి పోలేదు.

ఎవరో తను గింజుకుంటుండగా ఆ గుడిసె లోపలికి తీసుకపోయారు. గోడకు ఒరిగి నిలబడి ముఖం దాకా తెల్లగుడ్డ కప్పిన తన భర్త ముఖం మొదటిసారి, ఆఖరిసారి చూసింది.

రెండేండ్లు ఎట్లా గడిచాయో మల్లికకు గుర్తే లేదు.

భూమయ్య కొత్తచీర రవిక తెచ్చాడు. భూమయ్య వెంట ఆ గోదావరి తీరం దాటి గనుల ప్రాంతానికి అట్లా వచ్చింది మల్లిక.

తడుకల గుడిసె- మురికివాడ. ''రా అక్కా! వంట సిద్ధం,'' గుడిసెలో నుండి స్వాగతం పలుకుతూ ఎదురొచ్చిన అతన్ని మొట్టమొదటిసారి భయ సందేహాలతో చూసింది.

తను ముడుచుకపోయింది. అతను వారానికి రెండు మూడుసార్లన్నా వచ్చేవాడు. తినేవాడు. తన భర్త అతను కలిసి తనకు పరిచయం లేని తెలియని మాటలేవో రాత్రుళ్లు మాట్లాడుకునేవాళ్లు.

భూమయ్య డ్యూటీకి వెళ్లిన తరువాత మల్లిక తన ఒంటరితనంలోకి ముడుచుకపోయేది. మొగవాళ్లు మోసగాళ్లు. ఇది మాత్రమే అప్పటికి గ్రహించింది.

తనకు తెలియకుండానే భూమయ్యతో రోజూ గొడవ పడేది. తన లోలోపల ఏది దాగి ఉందో తెలిసేది కాదు. మళ్లీ తప్పు చేసినట్లుగా బాధపడేది. హఠాత్తుగా మొదటి భర్త చావు గుర్తొచ్చేది. ఇక్కడ దూరం పెరుగుతోంది.

ఇవ్వేమి పట్టించుకోనట్టే అతను సుడిగాలిలా వచ్చేవాడు. ఇల్లంతా స్వంతమన్నట్లే తిరిగేవాడు. తను మూతి ముడుచుకుంటే వంట తనే చేసేవాడు.

''అతనన్నా నేనన్నా ఉండాలి. అతనెందుకు మనింటికి రావాలి? పెండ్లి పెటాకులు లేవా? అసలే చిన్న గుడిసె. నువ్వు లేనప్పుడు...'' మల్లిక ఏడుస్తూ.

భూమయ్య ఏదో చెప్పబోయాడు. తను విన్పించుకోలేదు. ఎంతో కూడదీసుకొని, "నేను దిక్కు మాలిన దాన్ని. నన్ను వొదిలిపెట్టు. నాకు తెలువది," చేతులు జోడించి గజగజ వనుకుతూ మల్లిక అతనితో అన్నది.

అతను మాట్లాడలేదు. మరింక నెలరోజులు రాలేదు. భూమయ్యకు తిరుగుడెక్కువైంది. అతనే కారణమనుకునేది. కాని మల్లిక తనకు తెలియకుండానే అతని కోసం ఎదురుచూడసాగింది. అప్పటికి తనకు ఏదో కొంత తెలుస్తోంది.

భూమయ్య మొదటి షిఫ్టు పోయినవాడు ఏడు గంటలైనా రాలేదు. తను ఎదురుచూస్తోంది.

"భూమన్నను పోలీసులు అరెస్టు చేశారు," అతను ఎదురుగా నిలబడి.

"నువ్వేనా? నీ కళ్లు సల్లబడినాయా?" తను తిట్టింది.

ఆ తిట్లు పట్టించుకోకుండా, "బాయిలో గాలి సరీగా సప్లయి జరుగాలని ఖాళీ టబ్బులు వేళకు పని స్థలాలకు తేవాలని సమ్మె జరుగుతోంది. భూమయ్యే నాయకుడని అరెస్టు చేశారు. మనవాళ్లు విడిపించడానికి వెళ్లారు," ఎట్లా వచ్చినవాడు అట్లాగే పోయాడు.

తెల్లారి భూమయ్య నలిగిపోయి వచ్చాడు. తర్వాత తనను తల్లిగారింట్లో ఒదిలి వచ్చాడు. ఒక నెల-రెన్నెళ్లు, మూన్నెళ్లు- తను తల్లిగారింట్లోనే ఉన్నది.

తను వచ్చేసరికి కాపురం క్వార్టర్లోకి మారింది. రెండోసారి స్వాగతం చెప్పింది అతనే.

తను మాట్లాడలేదు. ఇల్లంతా పోస్టర్లు, సిరా మరకలు.

"నేను చాలా కష్టపడినదాన్ని, దిక్కులేనిదాన్ని," తన రుద్ధమైన ఓటమి గొంతుతో.

"నాకంతా తెలుసు," అతను.

తనేమి మాట్లాడకుండా ఏడ్చింది. తనను ముట్టుకున్నాడు. తండ్రిలాగా తల నిమిరాడు. అలాంటి ప్రేమ, ఆదరణ తనకు తెలియదు. కన్నీళ్లు తుడిచాడు. చిత్రమైన వొనుకు తన నిలువెల్లా పాకింది. "నువ్వెందుకు అర్థం చేసుకోవు," అప్పుడు అతని ముఖం చూసింది. అవే కళ్లు- కోపం లేని పెద్దపెద్ద కళ్లు.

తర్వాత అతని రాక తగ్గిపోయింది. ఒకసారి పలుక బలపం, ఏవో పుస్తకాలు తెచ్చాడు. తనకు గర్భం రావడం, బిడ్డ పుట్టడం- సంవత్సరం గడిచిపోయింది.

మల్లికనెవరో చెయ్యి పట్టుకొని వీధిలోకి లాక్కు పోయారు. మల్లిక జ్ఞాపకాలు తెగిపోయాయి.

ఉక్కుటోపీలు పెట్టుకున్న పోలీసులు ఎప్పుడు నిండిపోయారో? జనాన్ని దూరంగా ఇంకా దూరంగా తరుముతున్నారు.

అంతా నిశ్శబ్దమైపోయినట్లు- తనొక్కటే ఆ నిశబ్దంలో గడ్డకట్టుకపోయి నిలబడిపోయినట్లు- తను దేని గురించి ఆలోచిస్తోంది. తనకెందుకు ఇన్ని అర్థం పర్థంలేని జ్ఞాపకాలు ఈ సమయంలో పోటెత్తు తున్నాయి?

"నీ తప్పేముంది? నువ్వు ఈ ప్రపంచంలో అందరిలాగే బతకాలనుకున్నావు. నువ్వు పుట్టి పెరిగిన పల్లె గురించి, మనుషుల గురించి నీకు అన్నీ అర్థం కావాలి. నిన్ను ఎవరూ పట్టించుకోలేదు, చెప్పలేదు. నీ సందేహాలేమిటో? నీ దుఃఖమేమిటో? నిన్ను పట్టించు కోకుండానే నీ మొదటి పెళ్లి జరిగింది. ఔనా?" అతను.

ఔను. వీటన్నిటికన్నా తన సందేహాలతో- అంతర్ ప్రపంచంలో ముడుచుకపోయి- అవ్వన్ని తప్పని- తను లోకంలో ఎవరూ చేయని తప్పులు చేశానని లోలోపల కుమిలిపోతూ ఉండగా, "నువ్వు మనిషివే- లోపల మనుషులందరు అట్లాగే ఉంటారు," అతను. అతను తనను మొట్టమొదట పట్టించుకున్నాడు. వీళ్లందరిని తనకులాగే పట్టించుకున్నాడా?

మల్లిక అంతమందిలో తనకు తెలిసిన ముఖమే దన్నా ఉందా అని గాలించింది. చిత్రంగా లోపలి దుఃఖాలతో సహా అందరూ తనకు తెలిసినట్టుగానే ఉన్నారు.

మల్లిక అతన్ని గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నించింది. మరో నిమిషంలో ఆ జ్ఞాపకాలన్నీ రాకుండా ఏదన్నా చేస్తే బావుండుననుకున్నది.

నిశ్చలంగా ప్రేమగా ఆర్ద్రంగా ఒక కంఠం, "ఎవరి బతుకు వాళ్ల చేతుల్లో ఉన్నట్టే పైకి కన్పిస్తుంది. దుఃఖాలు మనకు మాత్రమే ఉన్నట్టు భయపెడతాయి. ఇవ్వన్నీ ఎక్కడ పుట్టాయో! సకల కష్టాలకు మూలం మన చేత మన ఇష్టంతో మన చేతుల్లో జరుగకపోవడం. మనం సృష్టించిన సంపద మనదికాకపోవడం. ద్వేషాలు, కోపాలు, తిట్టు దీవెనలు- ప్రేమలు అన్నీ దీనిలో నుండే వచ్చాయి. మీ ఊరి మనుషుల గురించి ఆలోచించు. అందరిది నీలాంటి వెతుకులాట- తండ్లాట కాదా?"

తను పలుకా బలపం పట్టుకున్నప్పుడు వనికిపోయింది. కాని లోపల అవ్వన్నీ తెలుసుకోవాలని వుండేది. పుస్తకాలు కూడబలుక్కొని చదువుతున్నప్పుడు విష ముష్టి చెట్లకింద వెక్కివెక్కి ఏడ్చింది గుర్తొచ్చేది. కళ్లు మసకబారి ఏవేవో రూపాలు తచ్చాడేవి.

పల్లెలు- భూములు- పంటలు- రాజులు- యుద్ధాలు- కోతి నుండి మనిషి రూపొందడం- ఏ ప్రాంతం వానివో- ఏ దేశం వానివో కథలు.

తనకు బయటి విశాల ప్రపంచంలోకి కిటికీ తెరిచాడతను. తను కరపత్రాలు చదువుతున్నప్పుడు, పోస్టర్లు రాస్తున్నప్పుడు భూమయ్య విస్తుపోయి చూశాడు. ఏమి జరిగిందో కాని భూమయ్య మునుపటిలా ఉండటం లేదు. లోలోపల తన ఎదుగుదల గురించి చిత్రమైన ఈర్ష్యనో మరేదో తెలియనిది ఇద్దరి మధ్య తచ్చాడుతోంది.

ఎందుకొచ్చిన తంటా- తను మానుకుంటే- అతనితో ముభావంగా ఉండేది. కాని రాకుంటే ఎదురు చూసేది. సంఘర్షణ పడేది. ఈ వెలుగును వొదులుకున్నానే అనుకునేది. కాని అతను రాగానే- గుబగుబలాడే వింత తమకంతో మాట్లాడేది.

తనకు అన్నీ తెలుస్తున్నాయి. ఈ కుటుంబం- బిడ్డ ఇవ్వన్నీ వొదిలి తను పూర్తికాలం పని చేయాలనుకునేది. వేనవేల ఆలోచనలు- వేనవేల కలలు- కలలు మేల్కొలిపినవాడు అతను.

“ఈ ప్రపంచంలో ఆడవాళ్లకు అక్క, తల్లి, భార్య- మొగవాళ్లకు తండ్రి, కొడుకు, భర్త ఇలాంటి పేర్లు కాక మరేవి లేవా?'' ఈ మాట తనెందుకు అడిగింది.

అతను మాట్లాడలేదు. పడకగదిలో అతనికి సంబంధించిన వాళ్ల ముఖ్యమైన మీటింగు జరుగుతోంది. టీ కావాలని తనకు చెప్పడం కోసం వచ్చాడు. తను చాయ్‌లు తయారుచేసి ఆ గదిలో ఇచ్చి ముందు గదిలో ఎప్పటిలాగే కూర్చున్నది.

తన ప్రశ్నకు జవాబు కోసం తను అడుగలేదు. చెప్పకపోతేనే బావుండును. తను అనుకుంటుండగానే అతను బయటకు వొచ్చి,

''నువ్వు రక్తసంబంధం కన్నా, ఏర్పడి ఉన్న సంబంధాల కన్నా భిన్నమైన సంబంధాల గురించి అడుగుతున్నావు కదూ.''

''ఊరికనే...''

''ఉందమ్మా...''

తన గుండె కొట్టుకోసాగింది. అది అతనికి తెలుస్తూనే ఉన్నది.

“అది రక్త సంబంధం కన్నా గొప్ప సంబంధం. కోట్లాది మానవులను కలిపే ఉత్పత్తి సంబంధం. సామాజిక జీవితానికి మూలమైన పని సంబంధం- సృష్టి కర్తల సంబంధం. ప్రపంచ కార్మికులారా! ఏకం కండు అన్నారంటే అదే. ఒక్క మాటలో చెప్పాలంటే కామ్రేడ్ల సంబంధం,'' ఏమాత్రం ఉద్వేగం లేని కంఠం.

ఆ గదిలో పచారు చేస్తూ అతను, “రెండు ప్రపంచాలున్నాయి. ఒకటి సకల సందేహాలు, సంస్కృతి సృష్టించే ప్రపంచం. రెండోది ఈ సృష్టిలో శ్రమైక భాగస్వామ్యం లేకుండా ఈ సృష్టిని, సంపదను దక్కించుకునే ప్రపంచం. రెండోది హింస ప్రపంచం. లౌకిక ప్రపంచం. మోసపు ప్రపంచం. దాని మాటతీరు వేరు- కోట్లాది మానవులు దీనిలో కలువజాలరు. కాని మొదటి ప్రపంచపు మనుషులు- శ్రమ చెమట ప్రపంచపు మనుషులు అసంఘటితంగా ఉన్నారు. వాళ్లను వెతుక్కోవాలి, ఐక్యం చేసుకోవాలి. రెండవ ప్రపంచం అన్ని రకాలుగా యుద్ధానికి దిగుతుంది.''

తను ఎవరితో కలువాలనుకుంటున్నది? తన భర్త ఎటు కలుస్తున్నాడు. అయినా ఇది అయ్యే పనేనా?

“అక్కా నువ్విక్కడ ఉన్నావా?'' పక్కింటి సుమతి మల్లికను ఊపుతోంది.

“బావ ఇంట్లో లేడు. మీ నిర్మల వస్తే అన్నం పెట్టి మా యింట్లో ఉంచి వచ్చిన,'' సుమతి.

మల్లిక చుట్టూ ఉన్నవాళ్లు చూస్తున్నారనే ధ్యాసే లేకుండా సుమతి మీద పడి ఏడ్చింది.

అప్పటిదాకా మసలి మసలినదేదో కరిగి కన్నీరైనట్టు చెప్పజాలని ఆత్మీయత, ప్రేమతో సుమతిని కావలించుకొని ఏడ్చింది.

*

పగలు పన్నెండు గంటలు దాటింది. ఎండ చిటపటలాడిస్తోంది. పోలీసులు వలయంగా ఏర్పడి దారులన్నీ దిగ్బంధం చేశారు.

ఆ ఇరుకు గల్లీ తూర్పు పడమరలుగా ఉంది. దక్షిణం వేపు పెద్ద బజారు నుండి మరొక ఇరుకు గల్లీ వచ్చి కలుస్తోంది. అస్తుబిస్తుగా గుడిసెల వరుసలు- అక్కడక్కడ సిమెంటు గోడల రేకుల షెడ్లు- ఆ గల్లీకి ఉత్తరం వేపున వ్యాపించి ఉన్న సర్కారు తుమ్మచెట్లు.

ఆ గల్లే ఇరుకంటే నీటిపంపుల కోసం కందకాలు తవ్వారు. చిందరవందరగా పైపులు, మట్టి. మట్టి కుప్పెకు కొంచెం ఎడంగా వీధిలో శవం బొక్క బోర్లపడి ఉన్నది. అయిదు బుల్లెట్లు వెనుక నుండి కాలిస్తే ఛాతీలో నుండి వెళ్లిపోయినట్లున్నాయి. చనిపోతూ ఆ మనిషి కొట్టుకుంటే అక్కడంతా మట్టి చెదిరి ఉంది. శవం నుండి కారిన నెత్తురు నల్లగా మారిపోయి ఉన్నది. శవంకు కొద్ది దూరంలో రెండు రంగుల 'మంకీ' ఉన్ని టోపి కుడిపక్క పడి ఉన్నది. శవానికి కొంచెం దూరంలో నల్లటి పిస్తోలు పడి ఉన్నది.

శవం కనపడకుండా పోలీసులు నిలుచున్నారు. యాభై గజాల దూరంలో వీధి మొగలో రెండు జీబులు ఆగి ఉన్నాయి. ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టరు అటిటు తిరుగుతున్నారు. ఒక జీబులో డియస్పీ నల్లటి కళ్లద్దాలు పెట్టుకొని కూర్చుని ఉన్నాడు. జీబులకు ఎడంగా కొంచెం పెద్దగా ఉన్న ఎవరి వాకిట్లోనో అయిదారుగురు సఫారి దుస్తులు ధరించి నిలుచున్నారు. వాళ్లకు కొద్ది దూరంలో కార్లు ఆగి వున్నాయి.

వాళ్లందరూ ఎవరి కోసమో ఎదురు చూస్తున్నట్లున్నారు. ఈ శవం ఎంత తొందరగా ఇక్కడి నుండి లేస్తే అంత తొందరగా ఈ వ్యవహారం ముగించాలనే ఆతురతలో ఉన్నారు.

వాళ్లకు కొద్ది దూరంలో బూడిద కుప్ప పక్కన చింతచెట్టు నీడలో స్థానిక విలేఖర్లు ఎప్పటి నుండో నిలబడి ఉన్నారు. వాళ్లల్లో ఒక ఫోటోగ్రాఫర్ కెమెరా బ్యాగులో పెట్టుకొని ఉన్నాడు.

అందరికన్నా ఎత్తుగా బక్కపలుచగా ఉన్న ఒక విలేఖరి అయిదోసారి డియస్పీ దగ్గరికి వచ్చి, ''ఎక్స్‌క్యూజ్‌మి సర్,'' అని కళ్లద్దాలు తీసి పట్టుకొని, ''సర్ మీరు ఏదీ చెప్పకుండా మాకై మేమే రాస్తే బావుండదు. రాయక తప్పదు,'' అన్నాడు.

ఆఫీసర్ పట్టించుకోలేదు. వినీవిననట్టే ఉన్నాడు.

ధైర్యం తెచ్చుకొని, ''ఇది ఎన్ని గంటలకు జరిగింది సర్?''

''ఆ సమయంలో నువ్విక్కడే ఉన్నావా?'' ఆఫీసర్ కరుకుగా క్రైంబ్రాంచ్ యస్పై ఆఫీసర్‌తో ఏదో గుసగుస లాడాడు.

''యస్పీగారు వస్తున్నారు. వచ్చిన తరువాతే అన్ని వివరాలు,'' ఆఫీసర్.

''ఫోటోలన్నా అనుమతించండి సర్,'' విలేఖరి.

''నో... ఐ కాన్ట్ హెల్ప్.''

ఈ గొడవంతా జరుగుతుండగానే, ఇది కలో భ్రాంతో తెలియకుండా ఒకానొక పత్రికా విలేఖరి స్వామి నిలబడి ఉన్నాడు.

అతనికి ప్రశ్నలు లేవు. జవాబులు అంతకన్నా అవసరం లేదు. తనొక పత్రికా విలేఖరినని, తను ఈ దిక్కుమాలిన వార్త తన జీవితంలో రాస్తానని, రాయాలని అనుకోలేదు, కోరుకోలేదు.

స్వామి పొట్టిగా ఛామనఛాయలో ఉంటాడు. సీదాసాదాగా ఉంటాడు.

అతని అంతరంగంలో చిత్రమైన అలజడి రేగుతోంది.

ఇది ఎట్లా సాధ్యమైంది?

స్వామి, అక్కడ మట్టిలో పడిపోయిన అతను వేరువేరు కారణాలతో పొట్ట చేతబట్టుకొని ఈ గనుల ప్రాంతానికి వచ్చారు.

అప్పుడు స్వామి ఎడ్లబండితో దుకాణాలల్లోకి సరుకులు చేరవేసేవాడు. తను బతకలేకపోయిన ఊళ్లో భూమి తగాదాలు. ఏటి ఒడ్డున తవ్వుకున్న నీటి కాలువలు- ఎండిపోయిన పైర్లు- గొడవలు. తను ఆ గొడవల్లో కూరుకపోయి కేసులు- కోర్టులు- తను ఇముడలేకపోయాడు. వ్యవసాయాన్ని, పంటలను వాటితో పెనవేసుకున్న ఫీలింగులను వొదిలి వచ్చాడు. నిజానికి అందరిలాగే తను గని కార్మికునిగా పనిలో చేరవల్సింది. కాని ఆ పని, ఆ అధికారులు అలాంటి వాతావరణంలో పని చేయడానికి మనసొప్పలేదు.

'అతను' బట్టలమూట సైకిలుకు కట్టుకొని బట్టలమ్మేవాడు. తను పుస్తకాల షాపు పెట్టుకున్న దశలో అతను అదే వీధిలో ఎలక్ట్రికల్ రిపేరింగు షాపు పెట్టుకున్నాడు.

తను అన్నింటితో గొడవ పడుతూనే అదే షాపులో భూస్థాపితం అయ్యాడు. అతను షాపుల్లో నుండి వ్యాపార లావాదేవీలల్లో నుండి బయటపడి మనిషయ్యాడు. అతను వార్త అయ్యాడు. తను ఆ వార్త రాయాల్సిన విలేఖరి అయ్యాడు. ఇవి కలలో కూడా ఊహించని పరిణామాలు. అక్కడ వేలాదిమంది బతుకులు ఎటుపడితే అటు మలుపులు తిరిగాయి. ఆ మలుపులు తిప్పిందెవరో? ఆ మలుపుల సారాంశమేమిటో? అతను మాత్రమే అర్థం చేసుకున్నాడు.

గనులల్లో కార్మికుల రక్తం పిండుకొని రక్తాని కింతని జీతాలు ఇచ్చేవాళ్లు. ఆ ఇచ్చిన జీతాలు కూడా చిత్రవిచిత్రమైన పద్ధతులలో తిరిగి గుంజుకోవడానికి అనేక దుకాణాలు వెలిశాయి. బొగ్గుగనిలో పనిచేసే కార్మికుని రక్తనాళాలు అంతర్జాతీయ మార్కెట్‌కు ముడివేయబడినాయి. ఈ దుకాణాలు తమలో తాము గొడువపడ్డాయి. సర్దుకొన్నాయి. ఈ క్రూర పోటీలో కొన్ని నలిగి నశించిపోయాయి. వ్యాపారం సరికొత్త హంగులతో వీధులను ఆక్రమించింది. అతను ఈ ఊసరవెల్లి మాయామర్మం అర్థం చేసుకున్నాడు. తను మౌనంగానే పైకి కనిపించని అతని సకల చర్యలను, పనులను ఊహించుకునేవాడు. భాష్యాలు చెప్పుకునేవాడు.

స్వామికి మొన్నటి రాత్రి గుర్తొచ్చింది.

రాత్రి తొమ్మిది కావొస్తోంది. ఏదో పత్రిక చేతిలోకి తీసుకున్న మధ్య వయస్కుడు అందులో సీలు చేసిన

చిన్న చీటి పెట్టి ఇచ్చాడు. తను వనికే చేతులతో అది తీసుకున్నాడు. షాపులో నుండి బయటకు పోయి విప్పి చూసుకున్నాడు.

''నువ్వు రాగలవా? ఒకమారు కలువాలని వుంది,'' ఆ చీటిలో అంతే రాసున్నది.

తనకు కొంచెం దూరంలో ఆ నడీడు మనిషి నిలబడి ఉన్నాడు.

షాపులో అబ్బాయికి షాపు మూయమని చెప్పి బయలుదేరాడు.

ఇలాంటి చీటీలు మామూలే- ఆ రాత తనకు తెలుసు. తనకు వచ్చే చీటీలన్నీ వార్తలకు సంబంధించినవి.

పన్నెండు సంవత్సరాల తరువాత తన మిత్రుడ్ని కలువబోతున్నందుకు మనసు ఉద్విగ్నంగా వున్నది. కలిస్తే ఏమి మాట్లాడగలడు? అంతా తెలుస్తూనే ఉన్నది. అంతా అర్థమౌతూనే ఉన్నది. ఇంకా మాట్లాడడానికేముంటుంది?

ఆ నడీడు మనిషి ఒక్క మాటయినా దోవ పొడుగునా మాట్లాడకుండా వెంట నడిచాడు. వాళ్లు సందులు గొందులు అరగంట నడిచిన తరువాత ఇంకా మీసాలైన సరిగారాని ఒక పిల్లవానికి అప్పగించి నడీడు వ్యక్తి వెళ్లిపోయాడు.

ఆ పిల్లవాడు ఆటోను పిలిచి పోనియ్యమన్నాడు. ఆటోను ఆపిన తరువాత తనే డబ్బు ఇచ్చాడు. ఆ తరువాత అస్తు, బిస్తు గుడిసెల మధ్య మరో పది నిమిషాలు నడిచాడు. ఒక గుడిసె ముందు ఆగారు. పిల్లవాడు లోపలికి వెళ్లాడు.

చూరు వంగి ఉన్న ఆ గుడిసెలోకి తనను పిలిచారు.

ఎటో పోవడానికి తయారై ఉన్న అతను ఎదురొచ్చి కావలించుకున్నాడు. చాలాసేపటిదాకా ఇద్దరూ మాట్లాడుకోలేదు.

''పిల్లలు బావున్నారా? వదిన ఆరోగ్యం ఇప్పుడెట్లా ఉంది,'' ఆ తరువాత తను రాసే వార్తల గురించి ఒకటి రెండు మాటలు అతనన్నాడు.

తను మూగమొద్దులాగే నిలుచున్నాడు. తను నిజానికి ఇంటా బయట ఘోర యుద్ధాలల్లో ఒంటరి తండ్లాటలో అలసిపోయి ఉన్నాడు. ఈ ఒంటరి పోరాటం కొనసాగించలేక, విరమించడం వీలుకాక చెప్పరాని యాతనలో ఉన్నాడు. అవ్వన్నీ కరిగిపోయాయి.

గాయాలు కడిగి మలాము రాసినట్టు లోలోపల నరాల కొసలకు అగ్గి అంటుకున్నట్టు- ఔను ఇది నిజమైన యుద్ధం. తను ఒంటరివాడు కాదు, మొదటివాడు ఆఖరివాడు కాదు.

పోలీసుల్లో కలకలం మొదలైంది. ఏదో హడావిడి. స్వామి ఆలోచనలు ఆగిపోయాయి.

దారిలో నిలబడి ఉన్న కార్లను వెనక్కి పంపించారు. బయట పెద్ద బజారులో కార్మికులు నినాదాలు ఇస్తున్నారు. అతను చనిపోలేదని, చంపబడ్డాడని అతను అమరుడని ఆకాశం దద్దరిల్లేటట్టు నినాదాలు.

లాఠీఛార్జి మొదలయ్యింది.

పోలీసు పరివారమంతా ఒక్కసారిగా వింత కరుకుదనంలోకి మారిపోయారు. సర్కిల్ విలేఖర్లని కూడా చూడకుండా ఆర్డర్లు వేశాడు. పోలీసులు అందరినీ దూరం నెడుతున్నారు. సఫారి బట్టలవాళ్లు దూరం తొలిగారు.

డియస్పీ జీబు దిగి అటెన్షన్‌లో నిలబడ్డాడు.

యస్పీ కారు హడావిడిగా వచ్చి ఆగింది. కారులో నుండి యస్పీ చిరాకుగా దిగాడు. బూట్లు టక టక లాడాయి. సాల్యూటులు స్వీకరించనే లేదు. అతను సివిల్‌డ్రెస్సులో ఉన్నాడు. డియస్పీ లోగొంతుతో ఏదో వివరిస్తూ పక్కనే నడుస్తున్నాడు. యస్పీ ముఖంలో చిత్రమైన రిలీఫ్ కన్పిస్తోంది.

పోలీసుల వలయం దోవ ఇచ్చింది. పటాలం శవం దగ్గరికి నడిచింది. సర్కిల్ పిస్తోలు గుడ్డతో తీశాడు. యస్పీ కార్లో వచ్చిన ఫోటోగ్రాఫర్ ఫోటోలు తీశాడు.

''ఇంతసేపు ఇక్కడే పెట్టుకొని డ్రామా చేస్తున్నారా?'' యస్పీ.

''పోస్టుమార్టం, ఆర్‌డీవో గురించి జీబు పంపాము. ఇంకా రాలేదు,'' డియస్పీ.

''నాన్సెన్స్,'' యస్పీ.

డియస్పీ తికమకపడ్డాడు. ''ఇలాంటివి ఇంత హంగామా చేస్తే తరువాత పరిణామాలు,'' ఇంగ్లీషులో యస్పీ.

''స్టేట్ లెవెల్ లీడర్ కదా సర్. పైగా రివార్డు,'' డియస్పీ.

''నీలాటి చాతకాని అధికార్లే లీడర్‌ను చేసింది,'' యస్పీ.

డియస్పీకి ఏమనాలో తోచలేదు. యస్పీ వాళ్లందరిని అక్కడే వదిలి కారు దగ్గరికి వచ్చాడు. విలేఖర్లు చుట్టుముట్టారు.

''నో నథింగ్ టు స్పీక్,'' అంటూనే డియస్పీని పిలిచి, ''అయిదు నిమిషాల్లో అయిపోవాలి.'' ఎట్లా

వచ్చిన వాడు అట్లానే కారెక్కి వెళ్లిపోయాడు. అతని వెంటే స్టెన్‌గన్‌ల సెక్యూరిటీ జీబు వెళ్లి పోయింది.

డియస్పీ ముఖం యస్పీ వదిలివెళ్లిన ఫీలింగును పులుముకున్నది.

"దిక్కుమాలిన ఇంగ్లీషుభాష కపటానికి అబద్ధాల కోసమే పుట్టింది," పొడుగు విలేఖరి.

పోలీసులు ఒక ధోవతి కట్టుకున్న మనిషిని అతని అన్నయ్య అని తీసుకొచ్చారు.

అతని అన్నయ్య ఎత్తుగా ఉన్నాడు. కోలముఖం, అవే పెద్ద కళ్లు. అతను దివాళా తీసిన చిరు వ్యాపారిలా ఉన్నాడు. ముఖంలో చిత్రమైన అసహనం. అతనికి అదే ఊళ్లో సరిగా నడవని చిన్న బట్టల దుకాణం ఉంది. ప్రేమ, ఉద్వేగం, దుఃఖం అన్నిటిని బతుకు పొడుగూతా అణచిపెట్టుకున్న దేబ ముఖం. అది బద్దలు కాగల దేమోనని తత్తరపాటుగా ఉన్నాడు. చూపెప్పుడో కోల్పో యినట్లుగా డియస్పీ, సర్కిల్ వెంట రాగా శవం దగ్గరికి నడిచాడు.

అలాంటి స్థితి అతనికి ముందే తెలిసినట్టు- ఆ స్థితిని ఎన్నోసార్లు ఎదుర్కొని సిద్ధపడినట్టు మృత్యువును బతుకంతా అనుభవించిన వాళ్లు- తీరా మృత్యువు ఎదురుపడితే ఎట్లా ఉంటారో అట్లా ఉన్నాడు.

ఒక కానిస్టేబుల్ డియస్పీ సైగ మేరకు శవం దగ్గరకు వెళ్లాడు.

"వద్దు," అతను గొణిగాడు.

హెడ్ కానిస్టేబుల్ అతని స్టేట్‌మెంటు రాసుకో వడానికి సిద్ధంగా ఉన్నాడు.

"అతను మీ తమ్ముడేకదా!" సర్కిల్.

పోలీసు తటపటాయించి శవాన్ని వెల్లకిలా పడుకోబెట్టాడు.

దూరంగా విలేఖర్లు ముంగాళ్ల మీద నిలుచుండి చూస్తున్నారు.

"ఈ పచ్చబొట్టు."

అతను తీవ్రమైన అలజడితో తల వంచు కున్నాడు.

"చెప్పు," సర్కిల్ గద్దించాడు.

అతను మాట్లాడలేదు.

యస్పై అతన్ని తాకుతూ నిలబడి, "మీ తమ్ముడే కదా!"

"కాదు. మా తమ్ముడు ఇక్కడ లేడు."

సర్కిల్ హెడ్ కానిస్టేబుల్‌కు సైగ చేశాడు. అతను రాసుకునేది అతను రాసుకున్నాడు.

"పోస్టుమార్టం తరువాత శవాన్ని మీకు యివ్వం," అన్న గొంతుతో సర్కిల్.

"దిక్కులేని శవమని మీరే కాల్చేయండి. ఈ శవానికి నాకు ఏ సంబంధం లేదు," అతను అరిచినట్టే చెప్పి అక్కడి నుండి కదిలాడు.

అతను తన తమ్ముడైనందుకు ఇల్లు ఎన్నోమార్లు చిల్లం కల్లం చేయబడ్డది- ఇంటి మీది గూన పెంకులు విప్పదీశారు.

అతడు తన తమ్ముడైనందుకు అతని మీది కోపం తను అనుభవించాడు. సోదాలు, ఊ అంటే పట్టుక పోవడాలు.

ఊగుతూ అతను వెళ్లిపోతుంటే స్వామి ఆ తొట్రు పాటును, బద్దలు కాబోయే దుఃఖాన్ని పసి కట్టాడు. అతని ఆత్మీయులు ఏడ్వడానికి కూడా ఇక్కడ వీలు కాదు. సంతోషాలే కాదు దుఃఖాలు పంచు కోవడం ఇక్కడ కష్టమే.

ఇన్నేళ్ల తరువాత తననెందుకు అతను కలు వాలి? "నేను మరింక కలువలేకపోవచ్చు. ఎందుకో ఒక మారు చూడాలనిపించింది," అతను వీడ్కోలు చెప్తుతూ అన్న ఆఖరిమాట.

ఆఖరి సందేశం తనకే ఇచ్చిపోయాడా?

స్వామి అంతరంగం మండుతోంది. మొన్న రాత్రి అంటుకున్న నరాల కొసలు మండుతున్నాయి. అది బాధా? దుఃఖమా?

నరాలు మండే మనుషులు- పడుకోలేరు, కూచోలేరు, నిలబడలేరు. వాళ్లు తిరుగుతూనే వుంటారు.

తన నరాలకు అంటుకున్న అగ్గేమిటి? అతని అంతరంగం, ఆలింగనం, స్పర్శ తనకు ట్రాన్స్‌మిట్ చేసిందేమిటి? అది మనిషి స్పృహయా? అది స్వేచ్ఛకు సంబంధించిన కాంక్షయా? అది మనిషి మీద మనిషి మోసే సమస్త అధికారాలను ప్రశ్నించే పెళ్లగించే పెను తుఫానా? అది లౌకిక ముసుగులన్నీ చింపేసి మనిషి కోసం మరొక మనిషి వెతికే వెతుకులాట- వెతకడం- పరితపించడం- ఒక్కమాటలో తలకిందుల అసంబద్ధ కౄరదోపిడి ప్రపంచాన్ని తిరస్కరించడమా? స్వామికి తలంతా అక్కడి వాతావరణంలాగే గందరగోళంగా వున్నది.

సర్కిల్‌కు వెలపరంగా ఉన్నది. అతని అన్నయ్య శవం మీద పడి ఏడుస్తాడనుకున్నాడు. అతను ఏడిస్తే తను రిలీఫయ్యేవాడు. డియస్పీ హడావిడి పడు తున్నాడు.

"యస్పీగారు వెళ్లిపోయారు. మేము శవాన్ని చూస్తాము," విలేఖర్లు.

"నో కుదరదు," అంటూనే సర్కిల్‌ను పిలిచి, "వీళ్లను పంపించి వేయి," అన్నాడు.

శిక్షణ, క్రమశిక్షణ, ఉద్యోగం, బాధ్యత- వీటన్నిటిని నిలబెట్టుకోవడానికి తనను తాను సదా సంసిద్ధ పరచుకోవడానికి తనకు తాను చెప్పుకునే ఫిలాసఫీ కూలిపోయింది. 'అదంతా ఉత్త హంబక్- అధికారమంటే దులిపేసుకోవడం- దులుపుకోజాలక మిగిలేవాడు తన చేతులు తన నెత్తి మీదే పెట్టుకోవడం- అంటే దీనికంతా పూర్తి బాధ్యత తనమీదే పడినదన్నమాట- చిత్రమైన వేట.'

మనిషి కదలిక లోలోపల తీవ్రమై అంతర్ బాహిర్ ప్రవర్తనల సమన్వయం కుదరక- అతని చావు పరిణామాల నీలినీడల ఉద్రిక్తతలో సర్కిల్ ముఖం.

విలేఖర్లను దూరంగా తీసుకపోయాడు.

"టెన్షన్ మీకు తెలుసు కదా!"

"కాని సర్, మేం వార్తలు రాయాలి కదా!" విలేఖరి.

"రాసుకోండి. యస్, రాత్రి ఒంటిగంటా పది నిమిషాలకు పెట్రోలింగు పార్టీకి అనుమానాస్పద పరిస్థితిలో ముగ్గురు మనుషులు తారసపడ్డారు. పోలీసు పార్టీని చూసి పరుగెత్తబోయారు. పట్టుకోవడానికి పోతే కాల్పులు చేస్తూ పరుగెత్తారు. పోలీసు పార్టీ ఆత్మ రక్షణార్థం..."

"పరుగెత్తే ఆ ముగ్గురు ఎన్ని రౌండ్లు కాల్చారు."

"మేం ఎంక్వయిరీ చేస్తున్నాం."

"ఈ కాలనీవాళ్లు అయిదు రౌండ్ల శబ్దాలే విని పించాయంటున్నారు. శవం మీద అయిదు తూటాల గుర్తులే ఉన్నాయి. అవి పోలీసులు కాల్చినవే. పది మంది పెట్రోలింగు పార్టీలో ఎవరికైనా గాయాల య్యాయా?"

సర్కిల్ తికమకపడ్డాడు.

"పెట్రోలింగు పార్టీలోని పోలీసులెవరినైనా మేం కలువొచ్చా?"

"నాన్సెన్స్," సర్కిల్ కోపంగా.

"సర్ గోతిలో పడిపోయి కుడికాలు విరిగిపోయినట్టు కార్మికులు చెప్పుకుంటున్నారు. మేం శవాన్ని చూడాలి."

"ఇంపాజిబుల్. బయట వేలమంది కార్మికులు- శాంతిభద్రతల సమస్య- మీరేదో బయట వాగుతారు. రెండు జిల్లాల్లో అప్రమత్తం చేశాం."

"ఇది ముందే తెలిసి పద్ధతి ప్రకారం జరిగినట్లుగా కార్మికులు చెప్పుకుంటున్నారు. మీరేమంటారు?"

సర్కిల్ ముఖంలో నెత్తురు చిమ్ముకొచ్చింది. అయితే కోపానికి పోతే డిప్లమసీ- తను ఇందులో ఇన్‌వాల్వ్ అయినట్లుగా వీళ్లు రాస్తే...

"ఇది రాయొద్దు. ఐ సే దిసీజ్ టూమచ్- రాస్తే ఏమౌతుందో మీకు తెలుసు," కరుకుగా మాట్లాడాడు. కాని దగ్గరికి నడిచాడు.

సర్కిల్ మాటల కోసం తడుముకున్నాడు. తను సూత్రధారుడు కాదని, పాత్రధారుడు మాత్రమే అని చెప్పాలనే ఒత్తిడి కంఠంలో గురగురలాడుతుంది.

"వెరీ బ్రేవ్ మ్యాన్," సర్కిల్ టోపీ తీసి చేతిలో పట్టుకొని.

విలేఖర్లకు కావాల్సింది అది కాదు. అందరికీ కాకున్నా మాట్లాడని స్వామిలాంటి వాళ్లకు కాదు.

"అతను తెలివైనవాడే కాని, నమ్మకం ఒక్కొక్క సారి- ఇంకా చెప్పాల్సిందేమీ లేదు. యుకెన్ గో."

"కాని మీరు తప్పక చెప్పి తీరవల్సిందే," ఒక కుర్ర విలేఖరి.

"వాట్- పారిపోయిన ఇద్దరిలో నువ్వొకనివని తోసేస్త. అక్కడ చెప్పుత," సర్కిల్ కర్కశంగా మాట్లాడి వెళ్లిపోయాడు.

అప్పటికే శవాన్ని వ్యానులోకి ఎక్కించారు. వ్యాన్లు పటాలం కదిలింది.

మరో అయిదు నిమిషాలల్లో ఆ వీధిలో నుండి శవం వెళ్లిపోయినా, ఆ వీధి దిగ్బంధం అట్లాగే కొనసాగించారు.

*

అతి విశాలమైన రైసుమిల్లు ఆవరణలోకి మారుతికారు దూసుకుపోయింది. తెరిచిన రేకు తలుపులు మూస్తూ వాచ్‌మన్ తను చేసిన నమస్కారం శేఠ్ పట్టించుకోనందుకు మనసులో ఏదో గొణుక్కున్నాడు.

ఆఫీసు గది ముందు, తల వెంట్రుకలల్లోపల ఊక- ఒళ్లంతా తౌడు నిండిన హమాలీలు రైసుమిల్లులోని ఇతర మగ, ఆడ కార్మికులు నిలుచుండి పోయారు. ఆఫీసు పక్క ఐదారు లారీలు ఆగి ఉన్నాయి. డ్రైవర్లు, క్లీనర్లు కారును చూసినవాళ్లు ఆఫీసు దగ్గరకు పరుగెత్తుకొచ్చారు.

ఆ రైసుమిల్లు అధినేత చంద్రశేఖర్ కారు దిగి నిలుచున్నాడు.

"సీజన్ టైం- కలకత్తాకు లోడు పెడుదామనుకున్నామా? పైగా అయిదారు లారీలు లోడు తెచ్చేవి ఉన్నాయి," గుమాస్తా చెప్పుకుపోతున్నాడు.

కాకీ నిక్కరు వేసుకున్న రొడ్డ రాములు అనే మిల్లు ఆపరేటర్, "ఇగో బయి అదంత తెలియదు. మా మనిషి చచ్చిపోయిండు. పోతం," అని చెప్పి లోపలికి వెళ్లిపోయాడు.

కిరకిరలాడుతూ, దబదబలాడుతూ తిరగాల్సిన రైసుమిల్లు ఆవరణంతా నిశ్శబ్దంగా ఉన్నది.

చంద్రశేఖర్ క్రీగంట అందరినీ చూశాడు. అదో విధమైన చెమట కంపుతో కలగల్సిపోయిన తౌడు వాసన, పొగాకు కంపు వ్యాపించింది.

రొడ్డ రాములు హమాలీల నాయకుడు. అతన న్నాడంటే పని ఆగిపోయినట్టే లెక్క. ఆగిందంటే ఆగిందే. మనసులో లెక్కించుకున్నాడు. లెక్కించుకుంటూనే తన గదిలోకి నడిచాడు.

"అరె లాభం-నష్టం సేఠ్ కెరుక మేం బోతం," బొంగురు గొంతు ఆడామె.

గుమాస్తా లోపలికి వచ్చాడు. ఏదో చెప్ప బోయాడు.

"ఫోన్ చేసి చెప్పు ట్రాన్స్‌పోర్టు ఆఫీసుకు. లారీ లను రేపు పంపమను. పర్చేజింగుకు పోయిన వాళ్లకు కబురు పంపు," చంద్రశేఖర్ కుర్చీలో కూర్చుంటూ.

అంటే రైసుమిల్లు బందన్నమాటే. గుమాస్తా బయటికొచ్చి ఆ మాటే చెప్పాడు.

వాళ్లు వెళ్లిపోతున్న అడుగుల చప్పుడు. వాళ్ల ముఖాలల్లో తను చూసిన విషాదాన్ని గుర్తుకు తెచ్చు కున్నాడు. ఆ వార్త తెలిసిన దగ్గరి నుండి ఎక్కడో ఏదో పోటెత్తుతోంది. కలవెలపడుతోంది. అయినా తనకు హమాలీల ముఖంలోని భావం కలుక్కుమనిపిస్తోంది. ఈ రైసుమిల్లులోనేమిటి? ఈ టౌనులోని హమాలీల కందరికీ అతను నాయకత్వం వహించాడు. తాను అనేక గొడవల్లో ఇరుక్కున్నాడు.

రైసుమిల్లు దాదాపు మూతబడే స్థితి దాకా తను మొండిచేసి కూర్చున్నాడు. తనకు లోపల ఆ డిమాండ్లు న్యాయమైనవని తెలుసు. కాని లాభం? వాళ్లడిగింది నయాపైస వంతే. కాని అది దండం పెట్టో బతిమిలాడో అడుక్కుంటేనో ఇచ్చేవాడు. ఇచ్చేవాడా? వాళ్లు పోరాడి సాధించుకున్నారు. పోరాటం అలవాటైతే, తీరా పరి ష్కరిస్తే చిత్రమైన స్థితిలో సాగింది.

చంద్రశేఖర్ కుడివేపునున్న ఫోన్ మోగింది.

'అరె బాపు ఏమి చేస్తున్నావు?' అవతలి కంఠం మార్వాడిసేట్ చున్నిలాల్‌దని తెలుసు.

చంద్రశేఖర్‌కు ఏమి మాట్లాడాలో తెలియలేదు.

"రైస్‌మిల్ పనిచేస్తోందా?"

"లేదు."

"మా ఇంటికి రారాదు?" చున్నీలాల్.

చంద్రశేఖర్‌కు ఎటు పోవాలో తెలియకుండా వున్న స్థితి నుండి చున్నీలాల్ ఫోన్ తెరిపిన పడగొట్టింది. లేచి నిలబడి ఒళ్లు విరుచుకున్నాడు. సాధారణంగా చంద్రశేఖర్ ఎప్పుడూ ఏదో మాట్లాడేవాడు. కాని ఈరోజు మాటలన్నీ ఎగిరిపోయినట్లున్నది. లింకులు- ఫోన్లు, లారీల వెంట చెక్‌పోస్టులు, మామూళ్లు- రైతుల దగ్గర ధాన్యం కొనుగోళ్లు- ఆర్డర్లు ఒకదాని వెంట మరొ కటి. అలాంటి లింకులన్నీ తెగిపోయినట్టుగా ఉన్నది.

మారుతీ కారెక్కి గేటు దగ్గరికి రాగానే వాచ్‌మన్ గేటు తెరిచాడు.

"మన్ బహద్దూర్ ఇదర్ ఆవో," అన్నాడు.

"లోడ్‌లొస్తే లోపలే పెట్టు. జాగ్రత్త- రాత్రి మంచు కురుస్తోందేమో? సాయంత్రం కాస్త టార్పాలిన్ కప్పు. నిన్న సాయంత్రం తెచ్చిన వడ్లు ఆపక్కనున్నాయి," జేబులో నుండి వంద రూపాయల నోటు తీసి ఇచ్చాడు.

వాచ్‌మన్ తీసుకోవాలా వద్దా అని తటపటా యించి తీసుకున్నాడు.

దోవ పొడుగుతా జనం- నల్లటి దుమ్ము- షాపు లన్నీ మూతపడి వ్యాపార లావాదేవీలన్నీ వాటికవే స్తంభించిపోయాయి.

ఆ టౌనుకు బందులు కొత్త కాదు. వారం కొక రోజు సెలవు. ఆరోజుల్లో కూడా వ్యాపారం దొడ్డిదారిన నడుస్తూనే ఉంటుంది. వ్యాపారులు దుకాణాలల్లో పని చేస్తే గుమాస్తాలు ఆ దుకాణాల చుట్టే తిరుగుతుం టారు. వ్యాపారులు ఎన్నడూ ఆ గొడవల్లో నుండి విముక్తులు కారు.

తనకులాగే వ్యాపారస్తుల మెదళ్లు స్తంభిం చాయా?

పరధ్యానంగా, చాలా నెమ్మదిగా కారు నడు పుతూ వీధులల్లో తిరిగే మనుషుల మొఖాలు చూశాడు. నిజంగా తనకు కొత్తగా వింతగా ఉన్నాయి ముఖాలు. తను మనిషి మొఖం చూడక ఎన్నో ఏండ్లయ్యిందా? ముఖాలు ఇన్ని భావాలకు నిలయాలా? డబ్బు లావా దేవీలు వీళ్లకు పట్టవా? కాదు డబ్బు లావాదేవీల స్థానే- తెలియని చావు బతుకుల మీమాంస చోటు చేసు కున్నదా?

కారు చౌరస్తా చేరుకున్నది. కదలడానికి వీలు లేనంతగా జనం- వీధి అంచులో నుండి తనకు తెలిసిన వ్యాపారస్తులు వీధిలో అందరిలాగే అసంబద్ధంగా తచ్చాడుతున్నారు.

వాళ్లకు, చనిపోయినతనికి సంబంధం? పైగా అతను వాళ్ల పక్షం వాడు కానేకాదు. లాభం-నష్టం-డబ్బు కాక మరేమి ఉంటుంది? తనకెందుకీ దుగ్ధ. అందరికి ఏదో కావాలి? ఇంతకాలం వ్యాపారంలో లాభానికి నష్టానికి దేవుణ్ణో అదృష్టాన్నో నమ్మేవాళ్లు. కాని ఈ గనుల ప్రాంతంలో మొదలైన అలజడి వ్యాపారంలో కూడా వ్యాపారస్థులు అనుభవించారు.

చంద్రశేఖర్‌కు చిత్రమనిపించింది. తను ఇట్లా ఆలోచిస్తానని అనుకోలేదు. ఔను వ్యాపారాలన్నిటికి అంతర్గత లింకేదో ఉన్నది. వ్యాపార కదలికలకు లోపల బయట లింకులున్నాయి. అతనికి- కొన్ని వ్యాపారాలు పడిపోవడానికి, కొన్ని పైకి రావడానికి సంబంధ మున్నదా? అది స్పష్టం కావడం లేదు.

కారు కదిలింది. కాసేపట్లోనే ఇరుకు గల్లీలో నుండి సేఠ్ చున్నీలాల్ మేడ ముందు కారాగింది. ఆ ఇల్లు రాజస్థానీ పద్ధతిలో పైకి చూస్తే అంత పెద్దగా వుండదుగాని- లోపల చాలా గదులు.

చంద్రశేఖర్ ఇంటికి ఎడంగా కారాపాడు. కాని దిగబుద్ధి కాలేదు. అందరు మార్వాడీలే ఉంటారు, తనొక్కడు తప్ప. వాళ్లు సంతోష సమయాల్లో 'బంగు' తాగుతారు. పైగా తను ఆ చెత్త మాటలు వినలేడు.

అక్కడ కారున్నదని- అందులో చంద్రశేఖర్ కూర్చున్నాడని పట్టించుకోకుండానే- మొదటి తరం మార్వాడీలు పాన్ నములుతూ లోపలికి పోతున్నారు.

ఇక్కడి బొగ్గుగనుల ప్రాంతంలో డబ్బు మనుషుల దగ్గర కదలడంతోటే మార్వాడీలు వచ్చి చేరారు. బహుశా దాని వాసన వెంటే పోతారేమో? నిత్యాసవర టోకు చిల్లర వ్యాపారాలతో పాటు బట్టలు, మందుల షాపుల్లోకి విస్తరించారు.

అప్పుడు మార్వాడీలకు తగువులు లేవు. వ్యాపా రంలో పోటీ ఇవ్వాల్టిలాగా లేదు. మహా అయితే స్థానిక వైశ్యులతో సర్దుబాట్లు, ఘర్షణలు, చిల్లర మల్లర వుండేవి. నిజానికి అప్పటికి ఇక్కడి కోమట్లకు పెద్ద వ్యాపారాలు తెలియవు.

చిన్నవో పెద్దవో కార్మిక సంఘాలు వచ్చాయి. కార్మికులు-యాజమాన్యం వీళ్లిద్దరి మధ్య ఉత్పత్తితో ముడిపడి ఉండే ఘర్షణలు పెరిగాయి.

భయంభయంగా వచ్చిన పల్లెవాళ్లు- అందునా దొరల కింద బాంచె బతుకు బతుకలేక వచ్చిన మాలమాదిగ లాంటి హరిజన కులస్థులే కార్మికులల్లో ఎక్కువగన్క, వాళ్లు దేనితోను ఘర్షణ పడలేదు. పల్లెల్లో సంఘాలు పుట్టి పెరిగాయి. 'దొర ఏందిరో దొరతనమేం దిరో,' అంటున్నారు. పోలీసుల-అరెస్టులు. ఒక కాలు పల్లెల్లో, ఒక కాలు బొగ్గుబాయిలో ఉండే కార్మికునికి అన్నీ తెలిసిపోయాయి. పైగా పల్లె కలలు కల్లలైనాయి. అంతో యింతో కార్మికుని గురించి మాట్లాడే కార్మిక యూనియన్లు యాజమాన్యం భాష, మాట నేర్చు కున్నాయి. ఇక్కడ లడాయి మొదలయ్యింది.

ఔను, సరిగ్గా ఇప్పుడే అన్నీ వ్యాపారులను దెబ్బ తీస్తూ కొత్త వ్యాపారం రంగం మీదికొచ్చింది. అది సారా బ్రాంది వ్యాపారం. అప్పుడు తనెక్కడున్నాడు? చున్నీ లాల్ దయాదాక్షిణ్యాలతో పెట్టుకున్న కిరాణా వ్యాపారం దివాళా తీసిన దశలో ఉన్నాడు. తను కోన్ కిస్కగాడు. కాని ఆ గొడవలన్నీ తాను చూశాడు.

అప్పుడు నిత్యావసర సరుకుల మార్వాడీలకు, వాళ్ల కనుసన్నల్లోనే ఉన్న వైశ్యులకు సారా బ్రాంది వ్యాపారులకు మధ్య తగాదాలు ముదిరాయి. పండుగలు, గణేశ పూజలు వగైరాలల్లో ఇవి బైటపడేవి. సారా బ్రాంది వ్యాపారాలు చేపట్టింది పల్లెల్లో పనులు బందు పెట్టబడి సాంఘిక బహిష్కారానికి గురైన భూ స్వాములు, లేదా కార్మిక సంఘాల నాయకులు, చిట్టీ వ్యాపారాల వాళ్లు. పైగా పల్లెలల్లో లొల్లులు చూసి వచ్చిన వాళ్లు.

నిత్యావసర సరుకుల వ్యాపారంలో మొండి ఖాతాలు మొదలయ్యాయి. మొండి ఖాతాల వసూళ్లకు గుండాలు అవసరమయ్యారు. అటుయిటు షాపుల మీద దాడులు చేసుకునేవారు.

అట్లా వ్యాపారంలో ఘర్షణ మొదలయ్యింది. అప్పుడు పోలీసులు, రాజకీయ పార్టీల వాళ్లు- వీళ్లు కాక గుండాలు అవసరమయ్యారు. అప్పుడే మక్సూద్ అనే గుండా రంగప్రవేశం చేశాడు.

చిన్నచిన్న వ్యాపారాలు దివాళా తీశాయి. లేక పోతే తీయించారు. సారా, బ్రాంది వ్యాపారాలు మామూళ్లు ఇచ్చాయి. వాడు మకుటంలేని మహారాజ య్యాడు. పెద్ద వ్యాపారాలు మరింత పెద్ద వయ్యాయి. కార్మికులు అల్లల్లాడిపోయారు. మక్సూద్ గ్యాంగు వాడవాడలా వెలిసింది. సమస్తం వాడి శరణు జొచ్చింది. దొమ్మీలు, హత్యలు, మానభంగాలు మామూలై పోయాయి.

అలాంటి స్థితిలో అధినాయకుడు మక్సూదును పట్టపగలు పెద్దబజారులో హత్య చేశారు. అప్పుడు ఈ పట్టణం నరకాసురుడు వధింపబడినప్పటిలాగా పండుగ చేసుకున్నారు.

చంద్రశేఖర్ కారులో నుండి దిగి డోర్లు లాక్ చేసి మేడ మెట్లు ఎక్కాడు.

చున్నీలాల్ గదిలో తెల్లని పరుపులు పరుచున్నాయి. బాలీసులకు చాలామంది మార్వాడీలు చేరి ఉన్నారు.

''బేటా ఆవో!'' చున్నీలాల్ ఆప్యాయంగా పిలిచినా చంద్రశేఖర్ ఒక మూల కూర్చున్నాడు.

వాళ్లు అప్పటికే చాలా మాట్లాడుకున్నట్టున్నది.

''మన పిల్లలు చెడిపోతున్నారు,'' చున్నీలాల్ కొత్త పాన్ దవడకేసి ఒక పాన్ చంద్రశేఖర్ కోసం పంపాడు. చున్నీలాల్ ఎర్రగా పొట్టిగా ఉన్నాడు. చిన్న కళ్లు.

''అదికాదు కాక! మక్బూద్ మర్డర్ కాకపోతే మనం దుకాణాలు తీసేవాళ్లమా?'' మోహన్‌లాల్ అన్నాడు.

వీళ్లు తనలాగే ఆలోచిస్తున్నారా? ఎందుకు? అంటే వ్యాపారంలో మళ్లీ కొత్త రాబోతున్నదా? మళ్లీ బలాబలాలు మారబోతున్నాయా?

''అది నిజమే మోహన్‌లాల్ బేటా! వ్యాపారస్తుడు పంతాలకు పోతే దివాళా తీస్తాడు,'' చున్నీలాల్.

''హోల్‌సేల్ ఆయిల్ మర్చంట్ నందూనూ ట్రేన్‌లో చంపేస్తే నువ్వు ఇట్లాగే అన్నావు,'' హీరాలాల్ కేడియా.

''ఆ వ్యాపారం అందరం కలిసి నందు తమ్మునికి నిలబెట్టామా లేదా? మనం చాలాదూరం నుండి వ్యాపారం కోసం వచ్చాము. లోకల్ గొడవల్లో ఇరుక్కుంటే నిరంజన్ కుటుంబంలాగా అయిపోతుంది,'' రాధేశ్యామ్ అన్నాడు.

''నువ్వు లక్ష చెప్పు, అతను సారాబందు పిలుపివ్వకపోతే మనం ట్రేన్ ఎక్కేదుండే- హోల్‌సేల్- రిటేల్ కుప్పకూలేవి,'' మదన్ అన్నాడు.

''మనిషి మామూలుగానే ఉన్నడట చూడాలె,'' గణేశ్ లేచి నిలుచున్నాడు. అతని వెనక మరికొంత మంది యువకులు వెళ్లారు.

చంద్రశేఖర్‌కు చెప్పరాని ఒంటరితనం. తను కలువజాలడు. అతనికి తెలియకుండానే అతని ఆలోచనలు సాగుతున్నాయి.

మర్వాడి యువకులు చాలామంది కిరాణా, బట్టలు వొదిలిపెట్టి కన్స్యూమర్ వస్తువుల వ్యాపారాల్లోకి దూరారు. అవి ముంచేవో తేల్చేవో చున్నీలాల్ లాంటివాళ్లకు అర్థం కావడంలేదు. షేరు వ్యాపారమని లక్షలాది రూపాయలు పెట్టి వొట్టి కాగితాలు తీస్తున్నారు. వ్యాపారంలో కుదురులేని పాత వ్యాపారస్తులు షేరు కబుర్లతో కాలం గడుపుతున్నారు.

ఇంతకుముందు డబ్బు లావాదేవీలు ముసలి వాళ్ల చేతుల్లో ఉండేవి. బ్యాంకుల మాట ఎరుగరు. కోట్లు లక్షలు 'గిరిగిరి' బ్యాంకుల ద్వారా మారేవి. ఇవి బయట తెలిసేవి కావు. ఇప్పుడు వ్యాపారం తేటతెల్లమైంది. పరుగు పందెమయ్యింది.

''బేటా మాట్లాడవు,'' చున్నీలాల్.

''ఏమీలేదుకాక- నాకివన్నీ తెలియవు,'' అని లేచి నిలుచున్నాడు.

మెట్లు దిగుతుంటే మరెక్కడికి పోవాలో అర్థం కాలేదు. కాని అక్కడ ఉండలేడు. బహుశ అన్ని కులాల వ్యాపారస్తులు ఇలాగే అనుకోకుండానే కలుసుకొని వుంటారు.

కారు ఎక్కి వీధిలోకి రాగానే- ఎటు పోవాలో అర్థం కాకుండానే పెద్ద బజారులోకి వచ్చి లక్ష్యం లేకుండానే పోనిచ్చాడు. ఊరికే గల్లీలకు పెట్టిన పేర్లు చదివాడు. ఇంత పెద్ద పారిశ్రామిక పట్టణంలో కూడా ఎవరిని ఎవరు కలువరు. కులాల పేరు మీదనే వాడలు- ఒకే కులస్థులే కాకుండా ఒక ఊరి వాళ్లంతా ఒకే దగ్గర ఇల్లు కట్టుకున్నారు. పల్లెలన్నీ నడిచొచ్చి దేనికదే ఇక్కడ ఏర్పడిపోయాయి.

తోవలో పద్మశాలివాడకు- వెంకటస్వామి తనను గుర్తుపట్టి ఆపాడు.

తను పిలిచాడో అతనే వొచ్చాడోగాని కారెక్కాడు.

''గుండాల పెంచి పోషించి- లక్షలు, కోట్ల సారా వ్యాపారాన్ని కంట్రోలు చేశాడు. శేఖర్ శేర్! నీకిది తెలుసా! సారా వ్యాపారస్తులంతా అయితే అధికార పార్టీ- కాకపోతే ట్రేడ్ యూనియన్ల నాయకులు. అంతా కలిసి మరో మనిషిని బతక్కుండా చేసిండ్లు,'' అప్పటికే వెంకటస్వామి కొద్దిగా తాగినట్టున్నాడు.

చిత్రంగా మందిలో కూడా వ్యాపారుల గుంపులు వాళ్ల వ్యాపారాలబట్టే ఉన్నాయి. బ్యాంకు అప్పులతో పెద్ద పెట్టుబడులతో స్కూటర్లు, టీవీలు అమ్మేవాళ్లు- బట్టల దుకాణాల వాళ్లు, చిన్న దుకాణాల వాళ్లు.

''మీరు చూసొచ్చారా?'' వెంకటస్వామి.

కారు చంద్రశేఖర్ ఇంటి ముందాగింది. నూనె పేరిన వెంకటస్వామి ముఖాన్ని పరిశీలనగా చూసి, ''లేదు,'' చంద్రశేఖర్.

''చిత్రంగాఉందే, చూడనిస్తలేరు. నేను పోయొచ్చిన. హాస్పటల్‌కు పోస్టుమార్టమ్‌కు తీసుకపోతరనుకుంట. అటు వెళుతుండగా మీరు కలిశారు పోదామా?'' వెంకటస్వామి.

ఔను, కాదనకుండా చంద్రశేఖర్ బిల్డింగ్ మెట్లు ఎక్కసాగాడు.

వెంకటస్వామి అనుసరించాడు.

అతన్ని తానెరుగును. అంతకన్నా అతని అంతరంగాన్ని తానెరుగును. వెంకటస్వామికి చెప్పితే- గుడ్లు మిటకరిస్తాడు. బహుశా వ్యాపారస్తుడు దేన్ని నమ్మకుండా నమ్మినట్టు నటిస్తాడేమో?

మెట్ల మీద చప్పుడుకు చంద్రశేఖర్ భార్య ఎదురొచ్చింది. ఆమె మట్టిముద్దలాగా అందవిహీనంగా ఉంటుంది. డబ్బుతో వొచ్చిన వొళ్లుతో కదలడమే కష్టమన్నట్లుగా ఉంటుంది. అతనికి భార్యంటే లోపల కనపడని మంటే. కనీసం ఆమె ముఖమన్నా చూడకుండా తన గదిలోకి నడిచాడు.

కార్పెట్టు- అందమైన మంచం- దానిపక్క సోఫాలు. వెంకటస్వామి ఏదో మాట్లాడుతూ అతని భార్య దగ్గరే ఉండిపోయాడు.

లోలోపల ఏదో కుప్ప కూలినట్లు- సర్వశక్తులు ఉడిగిపోయినట్లుగా మంచం మీద ఒరిగాడు. మొదట ఆ వార్త తెలిసినప్పుడు సంతోషం కలిగినట్టే అన్పించింది. పట్టించుకోనట్టే రెండు గంటలు అన్పించింది.

వెంకటస్వామి వచ్చి సోఫాలో కూలబడి, "నిజానికి మన వ్యాపారస్తులు పండుగ చేసుకోవాలి. అందరం తాగాం కాని ఎందుకో నిషా ఎక్కలేదు. సంతోషం కన్నా ఏదో అయిపోతున్నది," అన్నాడు విచారంగా.

చంద్రశేఖర్ లోపలిగదిలోకి వెళ్లి విస్కీబాటిల్ తెచ్చాడు. వెంకటస్వామి గ్లాసులు, జీడిపప్పు లోపలి నుంచి తెచ్చాడు.

బాటిల్ ఎత్తి చంద్రశేఖర్ రా కొట్టి గుప్పుమంటూ మంటేదో లేవగా వెంకటస్వామిని గదిలో విడిచి తన అంతరంగిక గదిలోకి వెళ్లాడు.

తను ఇరువై అయిదు సంవత్సరాల క్రితం పల్లె నుండి అయిదు కిలోమీటర్లు నడిచి తాలూకా సెంటర్‌కు పోయి పాలు మోసిన రోజులు. అంతకన్నా ముందు తన చిన్నతనం ఆకలితో చలిలో గడువని దీర్ఘ రాత్రులు. ఆకలికి తాళలేక పాతగుడ్డ సంచి మొలకు కట్టుకొని వరికోతల సీజన్‌లో రోళ్ల దగ్గర తౌడు అడుక్కుని బొక్కినది. ఆ తరువాత రైళ్లల్లో సంత్రాపళ్లు అమ్మింది. అయినా బతుకు గడువక ఇక్కడికి బావ దగ్గరికి వచ్చిన రోజులు. చున్నీలాల్ దుకాణంలో ఊడ్వడానికి కుదిరిన రోజులు.

ఎదురుగా నిలువెత్తు అద్దం. చంద్రశేఖర్ అద్దంలో తనను తానే చూసుకున్నాడు. నిగనిగలాడే బుగ్గలు, నునుపుదేలిన శరీరం. మెడలో గోల్డు చైను.

లోపలెక్కడో ఏదో పెళ్లగించబడుతోంది. అంగీ విడిచి వీపు చూసుకున్నాడు. వీపంతా కాలిన గుర్తులు అట్లాగే ఉన్నాయి. చలికాలంలో చలికి తాళలేక కప్పుకోను, తొడుక్కోను బట్టలు లేక కర్రమొద్దుల నెగడు దగ్గర పడుకుంటే వీపంతా కాలిపోయింది.

తన పెళ్లి, చున్నీలాల్ దుకాణంలో అమ్మకానికి కుదిరినప్పుడు జరిగింది. ఆ అప్పు చున్నీలాలే ఇచ్చాడు. తను మార్వాడీల నుండే నేర్చుకున్నాడు. కనపడని యుద్ధాలు, రక్తపాతాలు వ్యాపారంలో జరిగాయి. అంతదాకా ఒకదానికొకటి ముడిపడి ఏకచత్రాధిపత్యంగా ఉన్న వ్యాపారం- దాన్ని బద్దలు కొట్టినవాడు 'అతను'. అన్ని రంగాలల్లో మామూలు వ్యక్తులు ప్రవేశించినట్లుగానే తనబోటివాడు నిలదొక్కుకున్నాడు. మక్బూద్ హత్యతో వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు. పెద్ద తిమింగళాలు చెల్లా చెదురయ్యాయి.

అలాంటి సమయంలో నాలుగుసార్లు నాలుగు చోట్ల కిరాణా దుకాణాలు దివాళా తీసినట్లు నటించి ఈ స్థితికి వచ్చాడు.

అంటే ఆయువుపట్టు తనకు తెలిసిందన్నమాట. అయినా పైకి పెరిగినట్లు కనిపించినా లోపల బోలు అని తనకు అన్పిస్తోంది. ఎందుచేత, తను తనకు తెలియకుండానే అతనితో పోటీపడినట్టా? తను సర్వస్వాన్ని ఒదులుకున్నాడు. అతను ఒదిలిపెట్టిందే తను సర్వస్వం అనుకున్నాడు.

ఇప్పుడు మురికి చేతుల బట్టలు లేని పోరడు కాదు. చంద్రుడు కాదు, చంద్రశేఖర్. అయినా వెలితి- అదేమిటో తెలియడంలేదు.

చంద్రశేఖర్ ముందుగదిలోకి వచ్చేసరికి వెంకటస్వామి సగం బాటిల్ ఖాళీ చేశాడు. అది చలికాలమే అయినా పైన పంఖా తిరుగుతున్నా ఎందుకో వెంకటస్వామికి చెమటలు పట్టయి.

"ఏంగాదు ఒక్కడు ఈ దేహం ఒదిలి అందరిలో పరకాయ ప్రవేశం చేశాడు. మరింక ఎవడు మునుపటి తీర్గ ఉండడు. ఉండరుగాక ఉండరు. నాకు చెప్పొస్త లేదు. అతను మనుషులందరి లోపల ముట్టుకున్నడు, అంతే బస్." వెంకటస్వామి లేచి నిలబడి తమాయించుకున్నాడు.

"పద ఆఖరిసారిగా చూద్దాం," వెంకటస్వామి.

చంద్రశేఖర్ మౌనంగా అతన్ని అనుసరించాడు.

హాస్పిటల్ గోడల మీద, హాస్పిటల్ ముందు గల దుకాణాల కప్పుల మీద ఎట్లా తెలిసిందోగాని అక్కడంతా జనం నిండిపోయి ఉన్నారు.

అంబులెన్సు వచ్చి ఆగింది. పోలీసులు లాఠీఛార్జి చేశారు. జనాన్ని చెదరగొట్టారు. లౌడు స్పీకర్లో అరుస్తు న్నారు. బర్రుబర్రున అనేక వాహనాలు హాస్పిటల్ దగ్గరికి పరుగెత్తుకొచ్చాయి. హాస్పిటల్ మనుషుల తొక్కిడితో అల్లల్లాడిపోతోంది. అంతకుముందే పెద్ద గనుల అధికారులు వచ్చి చేరుకున్నారు. జనరల్ మేనే జర్లు, షిఫ్ట్ మేనేజర్లు, ఇంజనీర్లు, డాక్టర్లు, ట్రేడ్ యూని యన్ నాయకులు, అయిదారుగురు పెద్ద వ్యాపా రస్తులు అందరూ అక్కడే ఉన్నారు. అందులో చంద్ర శేఖర్ కూడా ఉన్నాడు.

మందిని చీల్చుకొని అంబులెన్సు సరిగ్గా హాస్పి టల్ లోపలి కాంపౌండులో ఆగింది.

ఒక్కసారిగా కలకలం. చిత్రమైన బెదరు, వొనుకు, ఉత్సుకత అన్నీ కలగల్సిన చిత్రమైన స్థితి.

మనిషి ఎట్లా ఉంటాడు. బొగ్గుగనులలోని చట్టా లను, ఉత్పత్తిని, కార్మికులను, అధికారులను, వ్యాపా రులను అన్నింటిని చదరంగంలోని పావుల్లాగా కదిపిన ఆ మనిషి ఎలా ఉంటాడు?

''అతనికి లేబర్ చట్టాలన్నీ క్షుణ్ణంగా తెలుసు,'' సీనియర్ పర్సనల్ ఆఫీసరొకాయన పట్టలేక పక్కా యనతో గుసగుసలాడాడు.

''రూల్సేముంది నా బొంద. అంతా రొడ్డకొట్టుడే,'' ఇంకో ముసలి అండర్ మేనేజర్ గొణిగాడు.

''ఏజెంటు ఫణిక్కర్‌ను చంపిన తరువాతే గదా! చిట్టీ రాస్తే బాయిలు బందయినాయి,'' ఇంకో కుర్ర మేనేజర్ కోపంగా ముఖం పెట్టి.

''ఎంతటివానికైనా దౌర్జన్యం చేస్తే ఈ గతి తప్పదు,'' అన్నాడు ఒక ఇంజనీరు.

నాలుగుసార్లు చావు తప్పించుకున్న ట్రేడ్ యూని యన్ నాయకుడొకడు తన గన్‌మెన్ వెంటరాగా తను నాయకున్ననే మాట మరిచి తోసుకొని ముందుకు పోబోయాడు.

పోలీసులకు అంతమందిని కంట్రోల్ చెయ్యడం అసాధ్యమౌతోంది.

హాస్పిటల్ సూపరింటెండెంటు ఆ మందిలో నుండి జనరల్ మేనేజర్‌ను తీసుకొని తన గదిలోకి వెళ్లిపోయాడు.

సాధారణంగా అయితే గవర్నమెంటు హాస్పిటల్లో చెయ్యాలి పోస్టుమార్టం. పది కిలోమీటర్ల దూరం. తొందరగా ముగించాలని యస్పీ తాపత్రయం. చీకటి పడితే ఏమౌతుందో తెలియదు. రెండు జిల్లాల్లో అప్రమత్తం చేశారు.

రూల్సుకి విరుద్ధంగా కంపెనీ హాస్పిటల్లో పోస్టు మార్టం చేస్తే తరువాత పరిణామాలుఎలా వుంటాయి? రిపోర్టు ఇవ్వాలి? ఇలాటి విషయాలు తేలక శవం అంబులెన్సులోనే ఉన్నది.

డియస్పీ, సర్కిల్ వీధిలో జీబులు వెళ్లజాలక వెనుకే ఆగిపోయారు. హాస్పిటల్ బయట నినాదాలు, లాఠీఛార్జి- పరిస్థితి అదుపు తప్పుతోంది. ఈ తతంగం తొందరగా ముగించకపోతే ఈ పారిశ్రామిక ప్రాంతం పేలిపోవచ్చు. మరేదైనా కావొచ్చు.

డియస్పీ అంబులెన్సు దగ్గరికొచ్చి అరిచాడు. యస్పీ గెస్ట్‌హౌస్‌లో కూర్చున్నాడు. ఈ శవం ఒక సమస్య. ఈ తతంగమంతా జరగాలి. పొద్దు క్రుంకితే గనులు తగలబడవచ్చు. డంపర్లు కాలిపోవచ్చు. బస్సులు ఏవైనా...

వైర్‌లెస్ పిలుపొచ్చింది. ఎంతదాకా వచ్చిం దంటూ.

అంబులెన్సులో శవం అట్లాగే ఉన్నది.

జనరల్ మేనేజర్‌కు తోచకుండా ఉన్నది. ఇది మామూలు కేసు కాదు. యండీకి లైటెనింగు కాల్ చేశాడు. యండీకి అంతకన్నా తెలియకున్నది. అతను పరిశ్రమల శాఖకో మరెక్కడికో ఫోన్ చేసి కనుక్కొని చెప్తాతానన్నాడు.

డియస్పీ కబురొచ్చింది.

సూపరింటెండెంటుకు గొంతుక దాకా వచ్చింది. ఎవరికి వారే తప్పుకుంటారు. తను ఎట్లా తప్పుకోవాలి? సర్జన్‌కు అప్పగించి చేతులు దులుపుకోవాలా? మార్గాల కేసి అన్వేషిస్తున్నాడు.

'రూల్సు, రెగ్యులేషన్లు, చదువు, అనుభవం వున్న తాము ఇండస్ట్రీ నడపడానికి ఎంత యాతన పడు తున్నారు? మందీ మార్బలం, ఆధునిక సౌకర్యాలు ఈ చిన్న విషయం తేల్చుకోలేకపోతున్నారు. అతను- ఏమీ లేని అతను- రకరకాలుగా చీలి ఉన్న లేబర్‌ను తాగు బోతులు, లుచ్చాలు, పనిదొంగలు, దగాకోరులు- అలాంటి ఇండియన్ లేబర్‌ను, ఆశగొట్టు కార్మికులను ఎట్లా మానేజ్ చేశాడు. తాగుడు మాన్పించాడు. సారా స్ట్రగుల్ నడిపాడు. కన్నింగ్ ట్రేడ్ యూనియన్లను, జిత్తులమారి నాయకులను, ఇటు ఇండస్ట్రీని, అటు ట్రేడ్‌ను అంతకన్నా గవర్నమెంట్‌ను ఎట్లా ఆడించాడు. ఇది సాధ్యమేనా? ఇన్ని శక్తుల ఉనికిని, మూవ్ మెంట్‌ను, డెవలప్‌మెంట్‌ను, బలాబలాలను ఎట్లా అర్థం చేసుకున్నాడు. విత్ గన్ అయినా హౌ కెన్ ఇట్ బి పాజిబుల్?' జనరల్ మేనేజర్ తనకు తెలియ కుండానే ఆలోచనల్లో కూరుకుపోయాడు.

"సర్ మీరతన్ని చూశారా?" సూపరింటెండెంటు కృష్ణమోహన్. అతను ఎర్రగా పండిన కర్బూజా పండు లాగా వజవజలాడుతూ ఉంటాడు.

కాశ్యప్, 'వాట్ డూ యూ మీన్?' అన్నట్టుగా అతని ముఖంలోకి చూశాడు.

"అతను మంచి ఆర్గనైజర్ సర్," కృష్ణమోహన్.

కాశ్యప్ ఔననలేదు, కాదనలేదు.

బయట వరండాలో ఏదో గలాటా జరుగుతోంది. కృష్ణమోహన్, కాశ్యప్ బయటకు వచ్చారు.

అయిదారుగురు కార్మికులను పోలీసులు వెనక్కి తోస్తున్నారు.

భూమయ్య పోలీసులను ఖాతరు చెయ్యకుండా కోపంగా వచ్చి నిలుచున్నాడు.

"రాత్రి షిఫ్టులో చనిపోయిన మా కొమురయ్య శవాన్ని తీసుకపోతం," అన్నాడు.

అంతదాకా ఆ విషయమే మరిచిపోయాడు కృష్ణమోహన్. ఇప్పుడు మరో చిక్కు. లాంఛనాలు. అర్డీవో వచ్చేసరికి ఆలస్యమయ్యింది. పైగా అనుకోని అవాంతరం.

"పోనీయ్. మన అంబులెన్సు పిలిచి పంపిం చెయ్యి," కాశ్యప్.

"బయట అంతమంది కార్మికులు. ఒకటి పోయి మరొకటౌతుందేమో?" కృష్ణమోహన్.

"పోలీసులున్నారు కదా! వాళ్లే చూసుకుంటారు. అది వేరు, ఇది వేరు కాదుగదా!" కాశ్యప్.

అంతలోనే బూట్లు టకటకలాడించుకుంటూ డియస్పీ వచ్చాడు.

కృష్ణమోహన్ రాత్రి గనిలో జరిగిన ప్రమాదం గురించి, కొమురయ్య చనిపోవడం గురించి చెప్పాడు.

అతను సర్కిల్‌కు చెప్పాడు.

మరో అయిదు నిమిషాలకు కొమురయ్య బంధు వులు ఏడుస్తుండగా కొమురయ్య శవం బయటకు వెళ్లిపోయింది. ఎందుకో చాలామంది కార్మికులు ఆ శవం వెంట కొమురయ్య ఇంటికేసి పోయారు. మళ్లీ తర్జనభర్జనలు. ఎట్టకేలకు యండీ నుండి క్లియరెన్సు వచ్చింది.

హాస్పిటల్లో హడావిడి మొదలయ్యింది.

అంబులెన్సు నుండి స్ట్రెచర్లో అతని శవాన్ని దించారు.

డాక్టర్లు, నర్సులు, పేషంట్లు అదుపు తప్పి కారి డార్లల్లో గుమిగూడారు.

కృష్ణమోహన్ కొంత అధికార స్వరంతోను, మరి కొంత బతిమిలాడే ధోరణిలో సర్జనుకు, మరొక డాక్టరుకు ఏవేవో చెప్పాడు.

కాశ్యప్ గదిలో నుండి బయటకు వచ్చాడు.

అతనికి నెత్తురుముద్ద తప్ప ముఖం కన్పించ లేదు.

పోలీసులు గవర్నమెంటు డాక్టరును, ఆర్డీవోను పట్టి తెచ్చారు. పొడవైన హాస్పిటల్ వరండాలో నుండి పోస్టుమార్టం గదికేసి మౌనంగా అలజడిగా అందరూ నడిచారు.

కొమురయ్య శవం వెంట పోతాననుకున్న భూమయ్యను అంబులెన్సులో పోలీసులు ఎక్కనియ్య లేదు. అంబులెన్సు వెంట మెయిన్‌గేటు దాకా పరుగెత్తాడు భూమయ్య.

భూమయ్యకు కోపంగా ఉన్నది. ఆవేశంగా వున్నది. పట్టరాని కోపంగా ఉన్నది. అప్పటికే బయట లాఠీఛార్జి. జనం పరుగెత్తుతూ మళ్లీ గుమిగూడు తున్నారు. తమ ప్రియతమ నాయకుడ్ని చూడడానికి దారులు వెతుకు తున్నారు.

హాస్పిటల్లో ఏం జరుగుతుందో ఎవరికి తెలియదు. చుట్టూ పోలీసులు. ఎంత భయపడతారు వీళ్లు. ఆ బక్కమనిషి- అదీ చనిపోయిన మనిషి కోసం ఇంతమంది ఎందుకొచ్చారు. తనెందుకు తచ్చాడు తున్నాడు. ఏముందని ఇంతమందికి దాచి పెడు తున్నారు.

భూమయ్యకు తిక్కతిక్కగా ఉంది. అదే సమ యంలో హాస్పిటల్ గేట్లో నుండి వచ్చే విలేఖరి స్వామిని చూశాడు. భూమయ్య అతన్ని ఎరుగును. పోలీసు వలయంలో నుండి అతను బయటకు వచ్చాడు.

భూమయ్య స్వామి వెంటవెంటనే కొంత దూరం వీధిలో నడిచాడు.

"లోపల ఏం చేస్తరే?"

"పోస్టుమార్టం అంట చేస్తరు."

"అయితే చూడనియ్యరా?"

"చూడనియ్యరు. అతనేదో మీ చెవుల్లో ఊదు తడని భయం." భూమయ్య తల గోక్కున్నడు.

"పోస్టుమార్టం చేసిన తరువాత సాక్ష్యాధారాలు మిగులకుండా దహనం చేస్తరు. అంతా కలిసి ఏవో రిపోర్టులు రాస్తరు," స్వామి.

"మీరు విలేఖర్లు కదా! నిలదీయలేరా?"

స్వామి భూమయ్య ముఖంలోకి చూశాడు. "ఇన్ని వేలమంది నిలదీస్తూనే ఉన్నారు. గనులు బందు పెట్టారు. అయినా వాళ్ల పద్ధతి వాళ్లదే," స్వామి.

ఇద్దరూ మౌనంగా మరికొంత దూరం నడిచారు. వాళ్ల వెనుకే పోలీసులు మందిని తరుముతూ వచ్చారు.

''దహనం కాష్టాలగడ్డనే చేస్తరు గదా!'' భూమయ్య.

''అక్కడే చేస్తరనుకుంటా.''

''అక్కడ ఇంకా బాగా పోలీసులు వస్తరనుకుంట,'' భూమయ్య.

''రానియ్యి. వాళ్లకు వాళ్ల పద్ధతులు, వీళ్లకు వీళ్ల పద్ధతులుంటాయి.''

భూమయ్య కొమురయ్య ఇంటికేసి నడక సాగించాడు. స్వామి అక్కడే ఒక హోటల్ ముందు చెక్క బెంచీ మీద కూర్చున్నాడు.

మళ్లీ భూమయ్యకు అతని జ్ఞాపకాలు చుట్టుముట్టాయి. అతని జ్ఞాపకాలు తప్పించుకోవడానికే ఇంటికి పోయాడు. మల్లిక బయటకు వెళ్లిపోయిన తరువాత బావురుమనే ఒంటరిగదిలో ఊరికనే తచ్చాడాడు. తన వెంట ఎవరో తిరుగుతున్నట్లు- ఆ గదిలో అనేక రాత్రులు గుసగుసలాడినట్లు, ఆ గదిలో వేలమంది గుండె చప్పుళ్ల తీవ్రతను ఇద్దరు పంచుకున్నట్లు, ఆ గదిలో నుండే తను సమ్మె పిలుపులను, కరపత్రాలను, వాల్‌పోస్టర్లను బయటకు మోసుకుపోయాడు.

అతను ఇట్లా ఒంటరిగా ఆలోచించి ఎరుగడు. దాదాపు అయిదారు సంవత్సరాలు ప్రవాహవేగంలో తను ఈదాడు. అప్పుడు అయిదు నిమిషాలు సమయం దొరికితే గుర్రుకొట్టి నిదురపోయేవాడు. పని నిరంతరం. ఒక యంత్రంలోని మరగా తిరిగాడు.

మధ్యలో రెండు సంవత్సరాలు ఎందుకు జరిగిందో ఎట్లా జరిగిందో కారణమేమిటో తెలియదుగాని యంత్రం నుండి విడిపోయి తుప్పు పట్టనారంభించాడు. అప్పుడు నిదుర కరువైంది.

ఏదో పగిలిపోతోంది. రెండు సంవత్సరాలుగా భద్రజీవితమనుకున్నది- తను పేర్చుకున్నది- బద్దలైంది.

చెప్పరాని నిస్సత్తువతో చెప్పరాని ఓటమితో మంచంలో కూలబడి ముఖం రుద్దుకొని వెక్కివెక్కి ఏడ్చాడు. తన లోపల ఇంత దుఃఖం గూడు కట్టుకున్నదని తనకు తెలియనే తెలియదు.

ఎప్పుడు దుఃఖమాగిపోయిందో ఎప్పుడు తాళమేసి వీధిలోకొచ్చాడో తెలియనే తెలియదు.

తన చిన్నతనం పల్లె బతుకు అన్నీ తవ్వి పోసుకుంటూ వితర్కించుకుంటూ వీధిలో ఊరకనే తచ్చాడాడు.

అనేక గొడవలు- పల్లెలో రైతుకూలి సంఘాలు- అరెస్టులు. ఈగాడుపు దుమారంలో ఎగిరొచ్చి ఈ గనుల ప్రాంతంలో పడిపోయాడు.

అప్పుడు- లారీ లోడింగు కంట్రాక్టు కార్మికునిగా పని చేయడానికి కుదిరిన వారంరోజులకే సమ్మె జరిగింది. అది కూడా అన్నాలు తినడానికి షెడ్డు ఏర్పాటు గురించి. ఆ గొడవలో ఏదో మీటింగు- అప్పుడు కలిశాడు తనకు అతను. అంతకుముందు తను పల్లెల్లో గొడవల్లో తిరుగుతున్నప్పుడెప్పుడో అతన్ని చూసినట్లు గుర్తు.

ఆ గుర్తులు చెప్పి అలాయిబలాయి. తను అలాంటి స్నేహం కోసమే వెతుకుతున్నట్టు అన్పించింది.

ఆరోజు తను విపరీతంగా సంఘర్షణ పడ్డాడు. పల్లెలో తనింక ఉండలేడు. అది పోయినప్పుడు ఇక్కడ స్థిరపడాలని రాలేదు. కాని రెండు మూడునెలల తర్వాత ఇక్కడే ఉండాలనుకున్నాడు. అరెస్టులు ఆ గొడవల జోలికి పోకూడదనుకున్నాడు. కానీ ఇక్కడ అదే జీవితం. కుదరలేదు. తను ప్రయోజకుడనని మరేదో అని అనుకున్నాడు.

రెండు నెలలు అలాంటి మనుషులనే కలవలేదు. పల్లెలో ఉన్న భూమి అమ్ముకవచ్చుకొని పది హేను వేలిచ్చి బదిలీ పిల్లరుగా చేరాడు.

అలాంటి సమయంలో అతను వెతుక్కుంటూ వచ్చాడు.

తన ప్రమేయం లేకుండానే ఋతువులు మారినట్టే అతనితో మమేకమయ్యాడు.

కాలరీ జీవితం. గల్లీలు- గుడిసెలు- కనీస వసతులు లేకపోవడం, షిఫ్టు డ్యూటీలు- రక్తం కక్కే పని. వ్యాపారం- ప్రతిచోట మోసపు ట్రేడ్ యూనియన్లు, ఆఫీసులు. వాటి లోపలి లోతులన్నీ తనకు తెలుస్తూనే ఉండేవి.

రెండు సంవత్సరాలు అనేక సమ్మె పోరాటాలల్లో లీనమయ్యాడు అతనితోపాటే.

తనకు కార్మికుల దగ్గర, అతని దగ్గర చిత్రమైన ఆదరణ దొరికింది. అయినా తనను వెంటాడే అసంతృప్తులు పెరుగుతూనే ఉండేవి.

ఇదంతా గ్రహించినట్టే, ''ఒకే ఊరిలో నివసించేవాళ్లు వృత్తులనుబట్టి, కులాలనుబట్టి, వాళ్లు పొందిన అనుభవాలను బట్టి భిన్నంగా ఉంటారు భూమన్నా! మనిషిని పడగొట్టడానికి, మంచి నుండి విడగొట్టడానికి, అవినీతిపరుల్ని చెయ్యడానికి, ఒంటరివాన్ని చెయ్యడానికి, స్వార్థపరుల్ని చెయ్యడానికి ఈ

సమాజ నిర్మాణం ఏర్పడి ఉన్నది. ఇవన్నీ స్వంత ఆస్తి నుండి వచ్చినవే.''

తను మాట్లాడలేదు. తెలుస్తూనే ఉన్నది. అది నిజమే.

ఈ గొడవల్లోనే తన పెళ్లి జరిగింది. మల్లికకిది రెండో పెళ్లి. తనకు తెలుసు.

మల్లిక పొంగిపోగలదని, ఇది ఆదర్శమని అందరికీ చాటాలని, తను మంచివాడనిపించుకోవాలని- ఇలాంటి ఆలోచనలతో ఆ పెళ్లి చేసుకున్నాడు. కాని లోపల తను అరెస్టులు గొడవల్లో ఉండడం మూలకంగా తనకు ఎవరు పిల్లనిస్తానని రాలేదు. అదొక బాధ.

మల్లిక కాపురానికైతే వచ్చిందిగాని తానూహించినట్లుగా జరుగలేదు. మల్లిక ఒదిగి ఒదిగి ఉండేది. పైగా తను ఏ విషయాలనైతే గొప్పవనుకునేవాడో వాటి పట్ల విముఖంగా ఉండేది.

అతన్ని ఇంట్లోకి రానియ్యొద్దని కొట్లాడేది. లోలోపల తనను తన వ్యక్తిత్వాన్ని తిరస్కరిస్తుందని బాధ.

కాని స్త్రీ పొందు, అదొక మైకంలాగా ఏడాది గడిచిపోయింది. బిడ్డ పుట్టింది. పాత స్పర్థలు పోయి కొత్తవి వచ్చాయి. అతను రావద్దని కొట్లాడిన మల్లిక కళ్లల్లో అతని రాకతో చిత్రమైన కదలిక వెలుగు కనిపించాయి.

మల్లిక తనపట్ల చిత్రమైన ఆదరణ కనపరిచేది. ఆ ఆదరణకు ఒకవైపు పులకింత- తన పనులు ఎంతో శ్రద్ధగా చేసేది. ఈ ఆదరణ కష్టమనిపించేది.

ఒక పరుగుపందెంలాంటిది తెలియకుండానే కుటుంబంలో చోటు చేసుకున్నది.

మల్లిక చదువు నేర్చుకుంటోంది. తను ఏ విషయాలనైతే గొప్పగా చెప్పాడో అవి ఆచరిస్తోంది. కాని అది తన వలన కాదు- అతని వలన. చిత్రమైన అనుమానంతో మల్లికను చూసేవాడు. ఆమె సర్వశక్తులతో మనిషి స్పృహతో తనను ఆలింగనం చేసుకున్నప్పుడు- ఇది తన వలన కాదు అతని వలన. ముడుచుకపోయేవాడు. పనికి పోయేవాడు. తన వ్యక్తిత్వం సంహరింపబడుతున్నట్లుగా గింజుకునేవాడు.

ఊరికనే మల్లిక తప్పుల కోసం వెతికేవాడు. ఏ తప్పు కన్పించేది కాదు.

అసంబద్ధ సమాజంలో మనిషి నిజమైన ప్రేమను శంకిస్తాడు. ప్రేమించే బదులు ద్వేషిస్తాడు. తలకిందుల ప్రపంచంలో మనిషి నిలబడడానికి ప్రయత్నం చేస్తే కళ్లు తిరుగుతాయి. భార్యాభర్తల గొడవలు పంచాయతుల గురించి అతను వివరిస్తున్నప్పుడు అది తన గురించే అనుకునేవాడు.

"నీకు నీ మొదటి భర్తతో..." ఒక రాత్రి తను మల్లికను అడిగాడు. ఈ మాట అడగాలనుకోలేదు.

మల్లిక షాకయ్యింది. గజగజ వనికిపోయింది.

దాదాపు నెలరోజులు ఇద్దరూ మాట్లాడుకోలేదు. తను పశ్చాత్తాపపడ్డాడు. పరమ నీచున్ననుకున్నాడు.

భార్య దృష్టిలో నుండి ఆ నీచత్వం పోగొట్టుకోవడానికి తను వీరున్నని తెలుపుకోవడానికి గనిలో సమ్మెలో ముందు నిలిచి అరెస్టయ్యాడు. బహుశా అది ఆఖరి అరెస్టు.

ఈసారి ఎక్కువగా ఆదరిస్తుందనుకున్న మల్లిక మౌనంగానే ఉండిపోయింది.

తను మల్లిక ఒక ఒప్పందం జరిగినట్లుగా జీవించసాగారు.

నిర్బంధం పెరిగింది. అరెస్టులు, ఎన్‌కౌంటర్లు. అయినా సమ్మెలు పెరిగాయి.

ఇద్దరూ అతనితోపాటు అన్ని కార్యక్రమాలల్లో పాల్గొంటూనే ఉన్నారు. తనకు సందేహాలు- కార్యక్రమాలపట్ల మొదలయ్యాయి. ఈ సందేహాలన్నిటికి మల్లిక జవాబులు తెలిసినట్లుగానే వ్యవహరించేది.

చిత్రంగా అతన్ని చూసి ఈర్ష్యపడే స్థితి వచ్చింది. అతన్ని తనే పట్టి ఇస్తానేమోనని భయపడేవాడు.

సమాచారం చేరవేసే వాళ్లు తయారయ్యారు. అలాంటి ఒక హత్య జరిగింది.

"అది తప్పు కాదా? మన కార్మికున్ని మనమే చంపితే ఎట్లా?" తను.

"మనుషులు రెండు రకాలు. ఒకటో రకం- తను శ్రమపడుతూ, ఆ శ్రమ ద్వారా బతికేవాళ్లు, ఇతరులకు హాని కల్గించనివాళ్లు. పుట్టుకతో కాదు సంస్కారంతో కూడా ఈ గుణం ఏర్పడుతుంది. మనిషి తెలియక ఇతరులకు హాని కల్గించే పనులు చేసినప్పుడు చెప్పినా మార్చుకోనప్పుడు శిక్ష తప్పదు. అది తెలిసి స్వార్థంతో చేసే పని. కార్మికవర్గ నియంతృత్వం అంటే అదే," అతను తన కళ్లల్లోకి చూశాడు.

తను పనికి పోయాడు.

"నువ్వు కార్మికునివి ఔనా కాదా? నువ్వు కార్మిక వర్గ భావజాలాన్ని గౌరవిస్తున్నవా లేదా అనేదానికి గీటు రాయి శ్రమ," అతను.

అదంతా తనకు తెలుసునన్నట్లుగా మల్లిక అక్కడి నుండి లేచిపోయింది.

అన్నం తిన్నారు. పడుకున్నారు కానీ, ముగ్గురికీ నిద్రలేదు.

తన దగ్గరికి జరిగి, "నామీద ఈర్ష్య పడుతున్నావు కదూ! నువ్వింకా మల్లికపట్ల భూస్వామ్య భావజాలం తోనే ఆలోచిస్తున్నావు. ఇన్ని చూసిన తరువాత ఇంత మందిలో తిరిగిన తరువాత కూడా వ్యక్తి నుండి మంది లోకి రాలేదు. ప్రపంచం పెనువేగంతో ముందుకు పోతోంది. ఈ మార్పులు నేను తెచ్చినవి కావు. చని పోయిన మన వాళ్లెందరో తెచ్చారు. మొదటి నుండి మనిషికోసం ఇలాంటి కొత్త ప్రపంచంకోసం మనుషులు త్యాగాలు చేస్తున్నారు. వ్యక్తులం మన అవసరాల కోసం ఉనికి కోసం ఉద్యమాలల్లోకి వచ్చినా మనం సమిష్టి జ్ఞానాన్ని, ఆచరణను ఏర్పాటు చేసుకోవాలి."

ఇక అతను తమ ఇంటికి రాడనుకున్నాడతను.

రాకపోతే తనే ఓడిపోయినట్లు- మళ్లీ తను మల్లిక దృష్టిలో అల్పుడిగానే మిగిలిపోతాడు. పదిహేను రోజులు అతను రాకపోతే తనకే కాదు, మల్లికకు మన శ్శాంతి కరువైంది.

పదిహేను రోజుల తరువాత ఏమీ ఎరుగనట్టు అతను నవ్వుతూ వచ్చాడు.

"నువ్వు మరింక మా ఇంటికి రావనుకున్నా," తను.

అతను జలజల కన్నీళ్లు రాలుతుండగా తనను ఆలింగనం చేసుకున్నాడు. అతను తామిద్దరి కన్నా ఎక్కువ సంఘర్షణ పడ్డట్టుగానే ఉన్నాడు.

"భూమన్నా! మనిషి డాఫర్ నిజమే. మనిషి కుత్సి తుడు. దొంగ, వ్యభిచారి, దుర్మార్గుడు అన్నీ కూడా. ఇవి మనిషి బయట జీవన వ్యాపారంలో కనిపించేవి. ఇవి మనిషి అసంబద్ధ ప్రవర్తనకు వ్యక్తీకరణలుగా కనిపించేవి.

" కాని భూమన్నా! లోపల మనిషి లేతాకులాగా సున్నితమైనవాడు, ఆత్మీయుడు. వాడు మహాద్భుత మైన సృష్టికర్త. ఇనుపముక్కను పట్టా మీద వేసి పరు గెత్తించగలడు. గాలిలో ఎగిరించగలడు. మట్టిని మంత్రించి రతనాలు పంటలు తీసేవాడు. భూగోళాన్ని గోళీకాయ చేసి ఫుట్‌బాల్ చేసి తన్నేయగలడు.

"నాకు చెప్పొస్తలేదు. వానికే ఈ శరీరం నీకేమైన చెప్పతోందా? భావుకుడు, స్వాప్నికుడు సమస్త జీవరాశు లను ప్రేమించి, స్నేహించి పోరాడే మహాద్భుతమైన శక్తిమంతుడు."

భూమయ్యకు మత్తులాంటిదేదో పాకుతుండగా వీధులు నడిచి కొమురయ్య ఇంటి ముందుకు చేరు కున్నాడు.

అప్పటికి కొమురయ్య పాడె సిద్ధమై శవయాత్ర ప్రారంభమయ్యింది.

భూమయ్య వనికే శరీరంతో ఆ శవయాత్రలో కలిసిపోయాడు.

సాయంత్రం అయిదుగంటలయ్యింది. మాగి మునిమాపు దుఃఖంలా ఆ కార్మిక పట్టణంమీద విషా దంలా వ్యాపిస్తోంది.

కొమురయ్య శవయాత్ర అంతకంతకు పెద్ద దైంది. వందలాది కార్మికులు ఆ శవయాత్రలో కొమురయ్య, అతను కలెగల్సిన దుఃఖంతో కోపంతో నడుస్తున్నారు. కొందరు ఆడవాళ్లు ఎక్కడి దుఃఖమో తన్నుకురాగా వర్ణించుకుంటూ ఏడుస్తూ వెంట పోతు న్నారు. బొగ్గు దుమ్ము ఒకరి ముఖాలు ఒకరికి కన్పించ కుండా ఆ వీధి వీధంతా పొగమంచులా కప్పేస్తుంది. మనుషులంతా బొగ్గు మనుషుల్లాగా నడుస్తున్నారు.

భూమయ్య కొమురయ్య పాడె నెత్తుకొని బొంగురు గొంతుకతో, "గోవిందా! గోవిందా!" అంటు న్నాడు.

శవయాత్ర పెద్దబజారు గుండా చిటపటలాడే చితిమంటలా చిట్లే మనుషులతో కలిసి హాస్పిటల్ ముందుకు వచ్చి ఆగింది.

దారి మూసేసిన పోలీసులు శవయాత్రను అడ్డగించారు.

పాడెను దించిన చోట ఏకుడు పేలాలు (మొరమొరాలు), చిల్లర పైసలు చల్లారు.

శవం వెంట వచ్చే ఆడవాళ్లు ఘొల్లుమన్నారు. "మీ ఉప్పాతం ఊడ్చుకపోను. బతకనియ్యకపోతిరి. మా సావు మమ్ముల సావనియ్యరా?" అన్నారు.

"అరె బై మా కార్మికుడు మేనేజుమెంటు అశ్రద్ధ వలన చనిపోయిండు. ప్రమాదంల చనిపోయిండు. మీరే నిజమైన ప్రభుత్వమైతే మేనేజుమెంటు నడుగాలె," ఒక కార్మికుడు అడుగుతున్నాడు.

"అడిగెటోల్లను చంపుతరు. చంపేది తెలుస్తది, బతికిచ్చేది తెల్వదు," మరో కార్మికుడు.

"ఈ బజారంత గుత్తకు కొన్నరా?" భూమయ్య వాదనలోకి దిగాడు.

సర్కిల్ ఆ గడబిడ దూరం నుండి చూసి వచ్చాడు. అతను అప్పటికే అలిసిపోయి ఉన్నాడు. వివరాలు తెలుసుకొని ఏ ఆలోచనలో ఉన్నాడో కాని శవయాత్రకు అనుమతినిచ్చాడు.

పాడెను ఎత్తుకున్నారు. "గోవిందా! గోవిందా!" అంటూ కార్మికులు పెద్దపెట్టున అరిచారు.

పోలీసులు అదేదో అతని మారుపేరైనట్టు బిత్తర పోయారు.

కార్మికులు హాస్పిటల్లోకి చూస్తూ శవయాత్ర అతి నెమ్మదిగా సాగించారు.

అతని పోస్టుమార్టం తతంగం ముగిసింది. డాక్టర్లు, పోలీసు అధికారులు, ఆర్డీవో కాసేపు గుసగుస లాడారు. అతని శవాన్ని అంబులెన్సు ఎక్కించారు.

కొమురయ్య శవయాత్ర హాస్పిటల్ దాటింది.

అదే వీధిలో వెనుక బయలుదేరిన అతని శవం వేసుకొని అంబులెన్సు బయలుదేరింది. అంబులెన్సు వెనుక జీబులు, కార్లు, పోలీసువ్యాన్లు. దారి పొడుగుతా పోలీసులు నిలుచున్నారు. అంబులెన్సు కొమురయ్య శవయాత్ర అడ్డం రావడంతో ఆగింది. మళ్లీ దింపుడు కళ్లం. ఇప్పుడు అది కొమురయ్య అనే కార్మికునిదో అతను అనే కార్మిక నాయకునిదో తెలియనంతగా కలిసిపోయింది.

అతి కష్టం మీద అంబులెన్సు పాడెను దాటుకొని ముందుకు పోయింది. అప్పుడు కొమురయ్య శవ యాత్ర వందల్లో నుండి వేలల్లోకి మారిపోయింది. ఇంకా బస్తీల నుండి గుడిసెల్లో నుండి ఇరుకు ఇరుకు వీధుల నుండి చెమట కంపు మనుషులు, బొగ్గు మను షులు, మట్టి మనుషులు- అన్ని వయసుల వాళ్లు వచ్చి కలుస్తూనే ఉన్నారు.

కొమురయ్య శవయాత్ర అలా రెండు కిలో మీటర్లు సాగింది. అందరూ 'అతని' జ్ఞాపకాలతో నడుస్తున్నారు.

శవయాత్ర అర్ధచంద్రాకారంగా దక్షిణం నుండి తూర్పుదిశగా వ్యాపించి ఉన్నరైలుకట్ట కింద పెద్ద మోరి గుండా తూర్పుకు సాగింది. రోడ్డు కిరుపక్కలా అన్ని చెట్లు కొట్టేయబడి అక్కడొకటి, ఇక్కడొకటి మిగిలిన ఇప్పచెట్ల మీద సాయంత్రం చేరిన పక్షులు అల్లరల్లరిగా ఈ లొల్లికి ఎగురుతున్నాయి.

రైలుకట్టనానుకొనే పాము మెలికలా నల్లని డాంబర్ రోడ్డు. రోడ్డు కావల గుట్టబోరు దాకా వ్యాపిం చిన నీలగిరి చెట్లు- ఆ చెట్లలోనే కాష్నాలగడ్డ.

కొమురయ్య శవాన్ని ఎడంవేపు దించారు. అతన్ని మోసుకొని వెళ్లిన అంబులెన్సు రెండు వందల గజాల కావల ఆగింది.

ఇప్పుడు పడమటి సూర్యుడు దిగంతాలను ఎర్ర డాలుతో ముంచెత్తాడు. పడమటి ఆకాశం నెత్తురు చిమ్మిన యుద్ధభూమిలాగుంది. తూర్పుకొండ మీద ఆకాశం విషాదం కమ్మిన వేలాది కార్మికుల ముఖా ల్లాగా ఉన్నది.

ఎడంవేపు కొమురయ్య శవ దహనం కోసం ఏర్పాట్లు చేస్తుంటే పోలీసులు పరుగెత్తుకొచ్చారు. అధికార్లు ఇక్కడ వీల్లేదు ఇంకా దూరం తీసుకపొమ్మ న్నారు.

వేలాదిమంది కార్మికులు ఒక్క పెట్టున మేము పోము అన్నారు. అనేక కంఠాలునినాదాలు చేశారు. ఆ కాష్నాల గడ్డ ఒకానొక కంఠం పిలుపుతో మారుమోగి నట్లయ్యింది.

పోలీసు ఆఫీసర్లు చుట్టూ చూశారు. అర్ధచంద్రా కారంగా ఉన్న రైలుకట్ట నుండి కాష్నాల గడ్డ దాకా ఒకానొక పెద్ద తటాకంలోని నీళ్లలాగా జనం. ఎందుకు అరుస్తున్నారు, ఏమని అరుస్తున్నారో తెలియకుండా అలలు అలలుగా నినాదాలు.

అధికార్లు వాళ్లల్లో వాళ్లు సంప్రదించుకున్నారు. ఏదో విధంగా ఈ పని జరిగిపోవాలి.

అంబులెన్సు మరికొంచెం దూరం తీసుక పోయారు. అక్కడిదాకా జనం వ్యాపిస్తూనే ఉన్నారు. విధిలేక అక్కడ వలయాకారంగా పోలీసుల బెట్టు కున్నారు.

తూర్పుదిక్కున అంతకంతకు నల్లబడే ఆకాశం. కొమురయ్య కాడు కార్మికులు పేర్చారు. అటు లారీ మీద వచ్చిన కర్రతో పోలీసులు అతని కాడు పేర్చారు. ఆ రెండు కాడుల మధ్య నొక్కి పట్టుకున్న దుఃఖంతో, తన్నుక వచ్చే కోపంతో వేలాదిమంది కార్మికులు నిలబడి అతని కాడుకేసి చూస్తున్నారు.

గని రాకాసి నమిలేసిన కొమురయ్యను అంత కన్నా పెద్ద రాకాసి చంపేసిన అతన్ని ఒకేసారి ఉత్తర దక్షిణాలకు కాడుల మీద వేశారు.

జనం హాహాకారాలు చేశారు. ఏ పేరు చెప్ప కుండా 'అమర్ హై' అనే నినాదం బయటకు అన్నారా? లేదు వాళ్ల మనసులో సుళ్లు తిరుగుతోందా? లోప లెక్కడో నిప్పు గుప్పుమంటోంది. మనిషి నరాల కొసలు అగ్గంటుకొని చిటపటలాడుతున్నాయి.

రెండు కాడులకు అగ్గి అంటించారు. చిన్నగా మొదలైన మంట నాలికలు చాస్తూ పెరుగుతోంది.

భూమయ్య మందిలో నుండి నరాలల్లో పరుగెత్తే రక్తంలా పరుగెత్తి పోలీసు వలయం వద్ద నిలుచున్నాడు. లోపలంతా మండుతోంది. నిశ్చలంగా బిగుసుకపోయి నిలబడి అతని ఆఖరి పెనుమంటను భూమయ్య చూస్తున్నాడు.

అనేక నమ్మెలు మంటల నాలికల్లా భూమయ్యకు తోచాయి.

ఆ మంట తనను... అదే ఆలింగనం- అదే స్పర్శ, అదే వొనుకు- అదే వేడి తన శరీరంలోకి ఏదో చొర బారుతోంది. ఏదో కలిసిపోతోంది.

భూమయ్య మెదడు తూర్పున దిగే పెను చీకటిలో జ్వలిస్తూ అతని శరీరం విస్ఫోటిస్తూ మండు తున్నట్టుగా ఉన్నది.

జ్ఞాపకాలన్నీ రంగరించి ఏకకాలంలో ముద్దయి పోయినట్లు ఒకే ఒక జ్ఞాపకం, ఒకే స్పర్శ, ఒకే ఒక్క మాట మాత్రమే మిగిలి ఉన్నట్లు అదేమిటో తెలియ నట్లు.

భూమయ్య తల వంచుకొని వెనక్కు తిరిగాడు. కార్మికులు పెద్ద పెట్టున గొనుగుతున్నారు. పట్టు తప్పి నట్లుగా అతని అన్ని పనుల గురించి బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు.

భూమయ్య కుడిజబ్బ ఎవరో పట్టుకున్నట్లని పించి తలెత్తి చూశాడు. స్వామి నిలబడి ఉన్నాడు. స్వామి కళ్ల నిండా నీళ్లు. వణికే తన కుడిచేతిని సాచి భూమయ్య స్వామి చేతిని అందుకున్నాడు.

"మనం రోజూ అనేకమార్లు చస్తాము. ఆ చావు లెవరికి కన్పించవు. ఇది చావు కాదు. ఇది మృత్యువు కాదు. చావులో కూడా అతను విజయుడే," స్వామి చెయ్యి ఇలాటిమాటను సంకేతించినట్లుగా భూమయ్య శరీరం గ్రహించింది. భూమయ్య చెయ్యి వెనక్కి తీసు కొని నడుస్తున్నాడు.

ఎత్తైన అర్ధచంద్రాకారపు రైలుకట్ట మీద వేలాది మంది స్త్రీ పురుషులు, వృద్ధులు, పిల్లలు తమ ప్రియ తమ నాయకుడికి వీడ్కోలు చెప్పుతూ నిలుచున్నారు. వాళ్ల నల్లని తలల మీద ఎర్రడాలు ఆకాశం ఎప్పుడో అస్తమించిన సూర్యుని జ్ఞాపకంలా.

భూమయ్య రైలుకట్టను సమీపించేసరికి ఆ మందిలో మల్లిక కన్పించింది. ఆమె ఒడిలో తమ కూతురు.

ఆ ముఖం- మల్లిక ముఖంలోని ఆ వెలుగు. ఔను ఆ వెలుగు తనకు తెలుసు. అది లక్షలాది కోట్లాది శ్రామికుల కంటి వెలుగు. అది అమ్మా, అక్కా, చెల్లి, వదిన, భార్య- లోకంలో ఇలాంటి పిలుపుల కన్నా అతీతమైన మనిషి వెలుగు.

భూమయ్య ఊగుతూ రైలుకట్ట ఎక్కి మల్లిక పక్క నిలుచున్నాడు.

మల్లిక కళ్ల వెంట అప్పటికే నీళ్లు కారుతున్నాయి. భూమయ్యను చూడగానే ఒళ్లోని కూతురును అలుము కొని వెక్కివెక్కి ఏడ్చింది. భూమయ్య ఆమె భుజం మీద చేయి వేశాడు. భూమయ్య మీద పడి జీవిత కాల మంతా ఘనీభవించిన దుఃఖమంతా పొంగి పొర్లినట్లుగా ఏడ్చింది.

భూమయ్య రైలుకట్ట మీది నుండి మండే రెండు కాడుల వేపు చూశాడు. జెగజెగ మండే కాడులు. అతని కాడు చుట్టూ నల్లగా ఆకారం లేని పోలీసు వలయం.

తూరుపున నాలికలు చాపుతూ మండే మంటలు. మంట చుట్టూ నల్లటి వలయంలా పోలీసులు, వారి వాహనాలు, కార్మికుల తలల మీదుగా పటమట వ్యాపించే చీకటి... ఈ వెలుగుచీకట్ల మధ్య వేలాది మంది కార్మికులు. భూమయ్య, 'మల్లిక' వాళ్ల కూతురు, స్వామి... అర్ధచంద్రాకారంగా సందిగ్ధ సంధ్య సంజె కెంజాయ వెలుగులో నిలుచున్నారు. అతను మండడమే తన ఉనికి అన్నట్లు మండుతున్నాడు.

*ఆహ్వానం మాసపత్రిక, ఏప్రిల్ 1995*

